www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -208 ఆదివారం15 నవంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



గిగ్ వర్కర్లు దేశానికి పునాదులు

'గిగ్ వర్కర్ల చట్టం' ప్రారంభోత్సవంలో రాహుల్

వారిని గౌరవించడమే కాంగ్రెస్ విధానం

గిగ్ వర్కర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా,

10లక్షల ఆరోగ్య బీమా అమలు చేసేలా చట్టం

ప్రతి డెలివరీ చార్జీలో 1శాతం.. వారి భవిష్యత్తు కోసం

గాంధీ కుటుంబం మాటిస్తే.. అది చట్టంతో సమానం

కార్మికులకు అధికారిక గుర్తింపు కార్డులు: రేవంత్

గిగ్ వర్కర్లతో కలిసి రాహుల్, రేవంత్ బైక్ ర్యాలీ



హైదరాబాద్ నవంబర్ 14(ప్రజావినికిడి):

గిగ్ వర్కర్లు దేశానికి అసలైన పునాదులని, వారిని కార్మికులుగా కాకుండా భాగస్వాములుగా గౌరవించడమే కాంగ్రెస్ పార్టీ విధానమని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. గతంలో తెలంగాణ గిగ్ వర్కర్లను కలిసినప్పుడు వారి కష్టాలను స్వయంగా విన్నానని, అన్ని రకాలుగా భద్రత కల్పిస్తామని ఆ రోజే వారికి మాట ఇచ్చానని గుర్తు చేశారు. నాడు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్ నేతృత్వంలోని ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. **మిగతా 2లో...**

అండర్-19 ఆసియా కప్ విజేతగా భారత్..

పాకిస్థాన్‌పై ఒక్క వికెట్ తేడాతో గెలిచిన భారత్



యువ జట్టుకు ప్రధాని మోదీ ప్రశంసలు

రికార్డు స్థాయిలో తొమ్మిదోసారి అండర్-19 ఆసియా కప్ కైవసం

యువ జట్టు అద్భుత ప్రదర్శనపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు

ఆఖరి బంతికి బౌండరీ బాది జట్టును గెలిపించిన మోహిత్ ఉల్వా

ఆకట్టుకున్న కెప్టెన్ లక్ష్య రాయ్‌చందానీ, ఆర్యవీర్ సెహ్వాగ్

ఢిల్లీ నవంబర్ 14(ప్రజావినికిడి):

మస్కట్ వేదికగా జరిగిన పురుషుల అండర్-19 ఆసియా కప్ 2026 ఫైనల్ పోరులో భారత యువ జట్టు అద్భుత విజయాన్ని అందుకుంది. దాయాది పాకిస్థాన్‌తో చివరి బంతి వరకు అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో టీమిండియా ఒక వికెట్ తేడాతో చిరస్మరణీయ విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. రికార్డు స్థాయిలో తొమ్మిదోసారి ఈ ట్రోఫీని ముద్దాడిన యువ జట్టుపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. **మిగతా 2లో...**



సీనియర్ నటుడు గిరిబాబు కన్నుమూత

టాలీవుడ్ లో విషాదం -అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన గిరిబాబు

గిరిబాబు వయసు 80 సంవత్సరాలు

600కి పైగా చిత్రాల్లో నటించిన గిరిబాబు

2లో.

కూటమి బలపరిచిన అభ్యర్థులే గెలవాలి

పంచాయతీ ఎన్నికలను తేలిగ్గా తీసుకోవద్దు.. : సీఎం చంద్రబాబు


పరిషత్ మరియు మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ప్రభంజనం

గ్రామాల్లోనూ ప్రభంజనం కొనసాగాలన్న టీడీపీ అధినేత

రాబోయే 30 ఏళ్లకు ఉపయోగపడేలా నాయకత్వ నిర్మాణం చేపడదామని సంకల్పం

ఎట్టి పరిస్థితుల్లో గొడవలకు పోవద్దన్న ముఖ్యమంత్రి

గతం కంటే కూటమికి 25 శాతం ఓటు బ్యాంకు పెరిగిందని వెల్లడి



అమరావతి నవంబర్ 14(ప్రజావినికిడి):

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వానికి చారిత్రక విజయాన్ని అందించారని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. పార్టీ ముఖ్యనేతలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 94 మున్సిపాలిటీల్లో, 3,235 వార్డుల్లో ఎన్డీఏ అభ్యర్థులు ఘన విజయం సాధించారని తెలిపారు. అలాగే 575 జడ్పీటీసీ స్థానాలు, 7,500 కంటే ఎక్కువ ఎంపీటీసీ స్థానాల్లో కూటమి నిలబెట్టిన అభ్యర్థులు జయకేతనం ఎగురవేశారని వివరించారు. **మిగతా 2లో...**



హైదరాబాద్‌లో పెట్ ఫెడ్..

నవంబర్ 21, 22 తేదీల్లో నోవోటెల్ వేదికగా ఈవెంట్

పెట్ ఫ్యాషన్ షోలు, అడాప్షన్ జోన్ల ఏర్పాటు

మూగజీవాల సంరక్షణపై నిపుణులతో మాస్టర్‌క్లాస్‌లు

హైదరాబాద్ నవంబర్ 14(ప్రజావినికిడి):

పెంపుడు జంతువుల ప్రేమికులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే ప్రసిద్ధ ఉత్సవం 'పెట్ ఫెడ్' మొట్ట మొదటిసారిగా హైదరాబాద్‌లో అడుగుపెడుతోంది. నగరంలోని నోవోటెల్ హోటల్ ప్రాంగణంలో నవంబర్ 21, 22 తేదీల్లో ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. పెట్ ఫెడ్ చరిత్రలోనే హైదరాబాద్ నగరం**మిగతా 2లో...**

తెలంగాణ ప్రజలకు రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలి: కేటీఆర్

హైదరాబాద్ పర్యటనలో ఉన్న ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని నిలదీసిన కేటీఆర్

కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో అబద్ధాల పుట్ట అంటూ ఎక్స్ వేదికగా ధ్వజం

420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారెంటీల అమలుపై సూటి ప్రశ్నలు

హైదరాబాద్/నవంబర్ 14(ప్రజావినికిడి):


తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రశ్నల వర్షం కురిపించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదో రాష్ట్ర **మిగతా 2లో...**



ఉత్తర కోస్తా దిశగా తుఫాన్ 'అక్వాన్'గా నామకరణం

20న తీరం దాటే అవకాశం -18 నుంచి మూడు రోజులు వర్షాలు

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరిక



విశాఖపట్నం, అమరావతి,నవంబర్ 14 (ప్రజావినికిడి):

తుఫాను ఉత్తర కోస్తా దిశగా దూసుకు వస్తోంది. ఈ నెల 20న తీరం దాటే అవకాశం ఉంది. ఇందుకు తగ్గట్టుగా జాగ్రత్తలు తీసుకోవాలని భారత వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో శుక్రవారం ఏర్పడిన అల్పపీడనం అదే ప్రాంతంలో శనివారం ఉదయానికి తీవ్ర అల్పపీడనంగా బలపడింది**మిగతా 2లో...**

అక్రమ అరెస్టులతో బీజేపీని ఆపలేరు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు -భారత్ సమ్మిట్ అట్టర్ ఫ్లాప్: సంజయ్

దేశ వ్యతిరేక శక్తులతో సమ్మిట్: ఈటల -రాంచందర్‌సహా పలువురి గృహ నిర్బంధం

హైదరాబాద్/నవంబర్ 14 (ప్రజావినికిడి):

కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించింది యాంటీ భారత్ సమ్మిట్ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఆరోపించారు. రాహుల్‌గాంధీ హాజరైన భారత్ సమ్మిట్.. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకువచ్చే సదస్సు కాదని, దేశ అంతర్గత రాజకీయ పరిస్థితులను విదేశీయులకు వివరించేందుకు కాంగ్రెస్ పెట్టిన కార్యక్రమమని విమర్శించారు. భారత్ సమ్మిట్‌కు వ్యతిరేకంగా శాంతియుత నిరసనలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును తార్నాకలోని ఆయన నివాసంలో ఓయూ పోలీసులు శనివారం గృహనిర్బంధం చేశారు. **మిగతా 2లో...**



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక


సీనియర్ నటుడు గిరిబాబు కన్నుమూత

టాలీవుడ్ లో విషాదం -అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన గిరిబాబు

గిరిబాబు వయసు 80 సంవత్సరాలు

600కి పైగా చిత్రాల్లో నటించిన గిరిబాబు





హైదరాబాద్ నవంబర్ 14(ప్రజావినికిడి):

తెలుగు చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ సీనియర్ నటుడు గిరిబాబు (80) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్ కొండాపూర్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నేడు తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో టాలీవుడ్ పరిశ్రమలో విషాద ఛాయలు అలముకున్నాయి.గిరిబాబు పూర్తి పేరు యర్రా శేషగిరిరావు. ఆయన 1946 జూన్ 8న ఉమ్మడి ప్రకాశం జిల్లా రావినూతలలో జన్మించారు. చిన్నతనం నుంచే నాటకాలు, కళారంగంపై ఉన్న ఆసక్తితో ఆయన సినిమా రంగం వైపు అడుగులు వేశారు. 1973లో విడుదలైన 'జగమే మాయ' చిత్రంతో ఆయన నటుడిగా వెండితెరకు పరిచయమయ్యారు. ప్రారంభంలో కథానాయకుడిగా కొన్ని సినిమాలు చేసినప్పటికీ, ఆ తర్వాత ప్రతినాయకుడిగా (విలన్), హాస్య నటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మారి తనదైన ప్రత్యేక శైలితో ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నారు.

నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన తన సినీ ప్రస్థానంలో గిరిబాబు 600కు పైగా చిత్రాల్లో నటించారు. ఎన్టీఆర్, ఏఎన్ఆర్, కృష్ణ, మోహన్ బాబు వంటి అగ్ర కథానాయకులందరితోనూ కలిసి నటించిన అనుభవం ఆయన సొంతం. 1977లో వచ్చిన పౌరాణిక చిత్రం 'కురుక్షేత్రం'లో దుశ్శాసనుడి పాత్రలో ఆయన చూపిన నటన ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోయింది. ఆ తర్వాత జ్యోతి, మెరుపు దాడి, పసివాడి ప్రాణం, బాలగోపాలుడు, హలో బ్రదర్, సిసింద్రి, లిటిల్ సోల్జర్స్, నిన్నే పెళ్లాడతా, చంద్రలేఖ, నువ్వే కావాలి వంటి ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రలను పోషించారు.మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త తరం హీరోల చిత్రాల్లోనూ నటించి మెప్పించారు. మహేశ్ బాబు 'అతడు' చిత్రంలో హీరోయిన్ తండ్రిగా ఆయన చేసిన నటన విశేష ఆదరణ పొందింది. అలాగే గమ్యం, అ ఆ, గీత గోవిందం, డిస్కో రాజా, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్, జాతి రత్నాలు వంటి సినిమాల్లో విభిన్న పాత్రలతో చివరి వరకూ ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నారు.గిరిబాబు కేవలం నటుడిగానే కాకుండా దర్శకుడిగా, నిర్మాతగా కూడా పరిశ్రమకు విశేష సేవలందించారు. ఆయన స్వీయ దర్శకత్వంలో 'రణరంగం' (1985), 'ఇంద్రజిత్' (1990), 'నీ సుఖమే నే కోరుతున్నా' (2008) వంటి సినిమాలు తెరకెక్కాయి. అలాగే 'మెరుపు దాడి', 'దేవతలారా దీవించండి' వంటి పలు చిత్రాలకు నిర్మాతగానూ వ్యవహరించారు. గిరిబాబు మరణం పట్ల సినీ ప్రముఖులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు.గిరిబాబుకు ఇద్దరు సంతానం కాగా, పెద్ద కుమారుడు రఘుబాబు ప్రముఖ కమెడియన్ గా కొనసాగుతున్నారు. చిన్న కుమారుడు బోసుబాబు గతంలో ఓ చిత్రంలో నటించారు. గిరిబాబు అర్ధాంగి శ్రీదేవి 2018లో కన్నుమూశారు.

అండర్-19 ఆసియా కప్ విజేతగా భారత్..

మొదటిపేజీ తరువాయి



భారత జట్టు సాధించిన ఈ చారిత్రక విజయంపై ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "భారత క్రికెట్‌కు ఇది ఎంతో గొప్ప రోజు. నేటి మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచి మెన్స్ అండర్-19 ఆసియా కప్ 2026 గెలిచిన మన యువ క్రికెటర్లను చూసి ఎంతో గర్వపడుతున్నాను. వీరి విజయం ఎంతోమంది యువతకు స్ఫూర్తినిస్తుంది. భవిష్యత్తులో ఈ జట్టు మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని ప్రధాని తన పోస్టులో పేర్కొన్నారు.అల్ అమెరత్ క్రికెట్ గ్రౌండ్‌లో శనివారం జరిగిన ఈ హై-వోల్టేజ్ ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 337 పరుగుల భారీ స్కోరు సాధించింది. పాక్ బ్యాటర్లలో ఉస్మాన్ ఖాన్ 107 పరుగులతో సెంచరీ సాధించగా, అబ్దుల్ ఖాదిర్ 80, కెప్టెన్ ఫర్హాన్ యూసుఫ్ 63 పరుగులతో రాణించారు. భారత బౌలర్లలో కాష్య పటేల్ నాలుగు వికెట్లతో సత్తా చాటగా, చిగురుపాటి వెంకట మూడు వికెట్లు తీసి ప్రత్యర్థిని కట్టడి చేశారు.అనంతరం 338 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్.. 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 339 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. భారత కెప్టెన్ లక్ష్య రాయ్‌చందానీ 101 బంతుల్లో 80 పరుగులు చేసి బాధ్యతాయుత ఇన్నింగ్స్ ఆడగా, ఆర్యవీర్ సెహ్వాగ్ 61 బంతుల్లో 58 పరుగులు చేసి మంచి ఆరంభాన్ని ఇచ్చారు. అయితే, మధ్యలో స్వల్ప వ్యవధిలోనే వికెట్లు కోల్పోయిన భారత్ 254 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది.ఈ దశలో మనల్ చౌహాన్, మోహిత్ ఉల్వా అద్భుత పోరాటపటిమ కనబరిచారు. వీరిద్దరూ కలిసి 9వ వికెట్‌కు 57 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పి మ్యాచ్‌ను తిరిగి భారత్ వైపు తిప్పారు. చౌహాన్ 32 బంతుల్లో 47 పరుగులు చేసి అవుటైనా, ఉల్వా క్రీజులో పాతుకుపోయి ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొన్నాడు.చివరి ఓవర్లో భారత్ విజయానికి 8 పరుగులు అవసరం కాగా.. మోహిత్ ఉల్వా, చిగురుపాటి వెంకట నిలకడగా ఆడి సమీకరణాన్ని చివరి బంతికి 3 పరుగులుగా మార్చారు. ఆఖరి బంతికి అహ్మద్ హుస్సేన్ వేసిన డెలివరీని మోహిత్ ఉల్వా బౌండరీకి తరలించి భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. ఉల్వా 49 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడు. దీంతో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన పాకిస్థాన్‌కు నిరాశ ఎదురవ్వగా, భారత్ తొమ్మిదోసారి ఆసియా కప్ ట్రోఫీని కైవసం చేసుకుంది.

కూటమి బలపరిచిన అభ్యర్థులే గెలవాలి

మొదటిపేజీ తరువాయి

ఈవీఎంలు అయినా, బ్యాలెట్ పేపర్లు అయినా, చివరకు పోస్టల్ బ్యాలెట్లలోనైనా ప్రజలు కూటమికే సంపూర్ణ మద్దతు పలికారన్నారు.ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వల్లే గతంతో పోలిస్తే కూటమికి ఓటు బ్యాంకు ఏకంగా 25 శాతం పెరిగిందని చంద్రబాబు తెలిపారు. ఉద్యోగులంతా ప్రభుత్వ విధానాలకు మద్దతుగా నిలిచారని, వైసీపీ తప్పుడు ప్రచారాలను ప్రజలు ఏమాత్రం నమ్మలేదని పేర్కొన్నారు. సుమారు 7 జిల్లాల్లో కూటమి క్లీన్ స్వీప్ చేసిందని, ముఖ్యంగా అనకాపల్లి, మార్కాపురం జిల్లాల ప్రజలు 100 శాతం స్ట్రైక్ రేట్ ఇచ్చారని గుర్తుచేశారు. పోలవరం ఎడమ కాల్వ ద్వారా అనకాపల్లికి నీటిని అందించడం, మార్కాపురం కొత్త జిల్లా ఏర్పాటు, వెలిగొండ ప్రాజెక్ట్ ఫేజ్-1 ఫలాలు ఈ ఫలితాల్లో స్పష్టంగా ప్రతిబింబించాయని విశ్లేషించారు.రాబోయే రోజుల్లో జరగనున్న మరో 23 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులు తిరుగులేని విజయం సాధించాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ ఎన్నికలను ఏమాత్రం తేలిగ్గా తీసుకోవద్దని హెచ్చరించారు. గ్రామాల్లో కూడా కూటమి బలపరిచే అభ్యర్థులే గెలవాలని, క్షేత్రస్థాయిలో ప్రజల ఆదరణ ఉన్న మంచి వ్యక్తులను, విద్యావంతులను, యువతను ప్రోత్సహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సరైన నాయకులను తీర్చిదిద్దుకోవడానికి ఈ ఎన్నికలు చక్కటి అవకాశమని, రాబోయే 30 ఏళ్లకు ఉపయోగపడేలా బలమైన నాయకత్వాన్ని నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు.

కేంద్రం, రాష్ట్రం, మున్సిపాలిటీలు, జిల్లా పరిషత్‌లలో ఇప్పటికే ఎన్డీఏ అధికారంలో ఉందని, పంచాయతీల్లోనూ మన అభ్యర్థులు గెలిస్తే పాలన, అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా, సజావుగా ముందుకు సాగుతాయని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా పనిచేసినంత కాలం వారు మన వెంటే ఉంటారని స్పష్టం చేశారు. కొందరు కావాలనే హింసను నమ్ముకుంటారని, కానీ కూటమి పూర్తిగా ప్రజాస్వామ్యాన్ని మాత్రమే నమ్ముతుందని చెప్పారు. నాయకులెవరూ ఎట్టి పరిస్థితుల్లోనూ గొడవలకు పోవద్దని, చెడ్డ పేరు తెచ్చుకోవద్దని గట్టిగా హెచ్చరించారు. అధికారాన్ని కేవలం ప్రజలకు మంచి చేయడానికి, వారికి మరింత చేరువ కావడానికి మాత్రమే ఉపయోగించుకోవాలని సీఎం హితవు పలికారు. గెలిచిన ఎంపీటీసీలు, జడ్పీటీసీలు నిరంతరం ప్రజల్లో ఉంటూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

గిగ్ వర్కర్లు దేశానికి పునాదులు

మొదటిపేజీ తరువాయి



హైదరాబాద్ మాదాపూర్‌లోని జయభేరి గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన 'తెలంగాణ గిగ్ వర్కర్ల సామాజిక భద్రత, సంక్షేమ పథకం' ప్రారంభోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్‌తోపాటు ఇతర నగరాల్లోనూ గిగ్ వర్కర్ల కోసం వై-ఫై సౌకర్యంతో కూడిన విశ్రాంతి కేంద్రాలను ప్రభుత్వం నిర్మించనుందని చెప్పారు. అక్కడ వాహనాన్ని పార్కింగ్ చేసుకుని, విశ్రాంతి తీసుకోవచ్చన్నారు. ప్రతి గిగ్ వర్కర్‌కు రూ.5 లక్షల ప్రమాద బీమా, రూ.10 లక్షల ఆరోగ్య బీమా అందించడానికి ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తోందని వెల్లడించారు.

గిగ్ వర్కర్లకూ వారికీ సామాజిక భద్రత ఉండాలని, వారి భవిష్యత్తు కోసం డబ్బు ఆదా కావాలని పేర్కొన్నారు. అందుకే వారు పూర్తి చేసే ప్రతి డెలివరీ, ప్రతి రైడ్ చార్జీలో 1శాతం మొత్తాన్ని వారి భవిష్యత్తు భద్రతకు వినియోగిస్తామని, సదరు మొత్తాన్ని ఆయా కంపెనీలు గిగ్ వర్కర్స్ బోర్డులో జమ చేస్తాయని తెలిపారు. బోర్డు ద్వారా ఆ సొమ్ము నేరుగా గిగ్ వర్కర్ల బ్యాంక్ ఖాతాలకు చేరుతుందన్నారు. కొత్త చట్టం ప్రకారం వారు చేసే పని, పూర్తి చేసే రైడ్లు, డెలివరీలు, ప్రతి రైడ్ లేదా లావాదేవీకి ఎంత డబ్బు చెల్లిస్తున్నారనే పూర్తి సమాచారం వారికి అందుబాటులోకి రానుందని వివరించారు. కార్మికులను కేవలం సేవకులు, బానిసలుగా అణచివేయాలనేది బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతమైతే.. కార్మికులకు భద్రత కల్పించి భాగస్వాములుగా మార్చడమే కాంగ్రెస్ భావజాలమని స్పష్టం చేశారు. గిగ్ వర్కర్ల కష్ట ఫలితం అంబానీ-అదానీలకు దక్కాలని, ఉబర్..ఓలా యాజమాన్యాలకు అందాలని ప్రధాని మోదీ భావిస్తున్నారని ఆరోపించారు. వారికి భద్రత, రక్షణ కల్పించాలని తాము భావిస్తున్నామన్నారు. గిగ్ వర్కర్లు భయపడాల్సిన పని లేదని, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డితోపాటు తెలంగాణ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. గిగ్ వర్కర్ల కుటుంబాల్లోని పిల్లల విద్య బాధ్యతను తీసుకోవడానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు.

రాహుల్ ఇచ్చిన హామీని నెరవేర్చాం

"గాంధీ కుటుంబం మాట ఇస్తే.. సువర్ణ అక్షరాలతో లిఖించిన చట్టంతో సమానం.. కొత్త చట్టం ద్వారా గతంలో గిగ్‌వర్కర్లకు రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని నెరవేర్చాం" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 2023లో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 4000 కిలో మీటర్ల పాదయాత్ర చేపట్టిన రాహుల్ గాంధీ.. పేదలు, కార్మికుల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారని గుర్తు చేశారు. నాడు హైదరాబాద్‌కు వచ్చిన సమయంలో గిగ్ వర్కర్ల సమస్యలపై స్పందించిన రాహుల్‌గాంధీ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రత్యేక చట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. నెహ్రూ జన్మదినం సందర్భంగా రాహుల్ గాంధీ చేతుల మీదుగానే కొత్త చట్టాన్ని అమలులోకి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు.

ఆన్‌లైన్ డెలివరీలు, క్యాబ్, ఆటో సర్వీసులు అందిస్తున్న గిగ్ వర్కర్లకు ప్రభుత్వం తరపున రూ.5లక్షల ప్రమాద బీమా కల్పిస్తున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10లక్షలకు పెంచి కార్మికుల కుటుంబాలకు ఆరోగ్య భరోసా కల్పించామన్నారు. గిగ్ వర్కర్ల సంక్షేమం, వారి హక్కులను కాపాడేందుకు ప్రత్యేకంగా గిగ్ వర్కర్స్ బోర్డును ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. అర్హులైన ప్రతి కార్మికుడికి అధికారిక గుర్తింపు కార్డులు అందజేస్తామని వెల్లడించారు. 'రాష్ట్రంలో ఏ కార్మికుడూ అభద్రతాభావంతో బతకాల్సిన అవసరం లేదు. మీ చెమట విలువను గుర్తిస్తూ ఈ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుంది' అని భరోసా కల్పించారు. గిగ్ వర్కర్ల తరఫున రాహుల్‌గాంధీకి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గిగ్ వర్కర్ల సంక్షేమ పథకం అమలు పాలసీ బుక్‌ను ఆవిష్కరించిన రాహుల్, సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు.

గిగ్ స్టాప్‌లను ప్రారంభించిన రాహుల్

గిగ్ వర్కర్ల కోసం ఏర్పాటు చేసిన విశ్రాంతి కేంద్రాలను (గిగ్ స్టాప్‌లను) సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి రాహుల్ గాంధీ ప్రారంభించారు. గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన బస్సులో రెస్ట్ రూమ్‌లు అందుబాటులో ఉన్నాయి. వివిధ ప్రాంతాల్లో తిరిగే గిగ్ వర్కర్లు విశ్రాంతి తీసుకునేలా ఈ బస్సును రూపొందించారు. అలాగే, సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ సౌజన్యంతో తొలుత పటాన్‌చెరు, తెల్లాపూర్, చందానగర్, భారతీనగర్, కొండాపూర్ ప్రాంతాల్లో గిగ్ స్టాప్‌లను అందుబాటులోకి తెచ్చారు. గిగ్ వర్కర్లు ఎవరైనా సరే అందులో కూర్చుని తినవచ్చు. సేద తీరొచ్చు. కాలకృత్యాలను తీర్చుకోవచ్చు. ఈ రంగంలో పని చేస్తున్న దివ్యాంగ గిగ్ వర్కర్లకు ఈ గిగ్‌స్టాపలు ఎంతగానో దోహదపడనున్నాయి.

గిగ్ వర్కర్లతో రాహుల్ బైక్ ర్యాలీ

గిగ్ వర్కర్లతో కలిసి రాహుల్ గాంధీ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. తొలుత హైటెక్ సిటీలోని శిల్పారామం ముందు ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌తో కలిసి నివాళులర్పించారు. అనంతరం ర్యాపిడో బైకర్ లలిత స్కూటీపై రాహుల్ గాంధీ, మరో బైక్‌పై సీఎం రేవంత్ ప్రయాణించారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. శిల్పారామం నుంచి జయభేరి గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సభ వరకు ర్యాలీ సాగింది.

ఉత్తర కోస్తా దిశగా తుఫాన్

.మొదటిపేజీ తరువాయి

ఇది వాయవ్యంగా పయనించి ఆదివారం నాటికి వాయుగుండంగా మారనున్నది. ఆ తర్వాత ఉత్తర వాయవ్యంగా పయనించి ఈ నెల 16వ తేదీ సాయంత్రానికి తుఫానుగా బలపడి బంగాళాఖాతంలోకి ప్రవేశించనున్నది. దీనికి ఇరాన్ దేశం సూచించిన 'అక్వాన్' అని పేరు పెట్టనున్నారు.

ఇది ఉత్తర వాయువ్యంగా పయనించి 18వ తేదీ ఉదయానికి తీవ్ర తుఫాన్‌గా బలపడి రెండు రోజులపాటు సముద్రంలోనే కొనసాగుతుంది. ఆ సమయంలో భూ ఉపరితలం నుంచి చలిగాలులు వీచే అవకాశం ఉన్నందున సముద్రంలో కొంత బలహీనపడి తుఫాన్‌గా లేదా వాయుగుండం/తీవ్ర వాయుగుండంగా మారి 20వ తేదీ ఉదయం ఉత్తర కోస్తాలో తీరం దాటుతుందని అంచనా వేస్తున్నారు. సముద్రంలో కొనసాగిన సమయంలో గాలులు 100 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని, తీరం దాటే సమయంలో గాలుల వేగం కొంతవరకు తగ్గుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. కాగా, ఆదివారం నాటికి వాయుగుండంగా బలపడిన తరువాత కోస్తాలో తీరం వెంబడి గాలుల వేగం పెరుగుతుంది.అందువల్ల మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది. ఈ నెల 18 నుంచి 20 వరకు కోస్తాలో విస్తారంగా, ఉత్తర కోస్తాలో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయి. ఈ నెల 19న ఉత్తర కోస్తాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని తుఫాను హెచ్చరిక కేంద్రం తెలిపింది. వాతావరణ పరిస్థితుల ప్రభావంతో సముద్రంలో తీవ్ర తుఫాను కొంతవరకు బలహీనపడినా ఉత్తర కోస్తాలో గాలులు వీస్తాయని, వర్షాలు కురుస్తాయని తెలిపారు.

కాగా నవంబరు నెలలో తుఫాన్లు ఎక్కువగా దక్షిణ కోస్తా, ఉత్తర తమిళనాడుల్లో తీరం దాటుతాయి. నవంబరు రెండో వారం తరువాత ఉత్తర కోస్తాలో తుఫాన్లు తీరం దాటడం, తీరం దిశగా రావడం 125 ఏళ్లలో ఒక్కసారే జరిగింది. 1998 నవంబరు 15న ప్రస్తుత అనకాపల్లి జిల్లా పూడిమడక ప్రాంతంలో తుఫాన్ తీరం దాటిందని వాతావరణ అధికారి ఒకరు తెలిపారు.

హైదరాబాద్‌లో పెట్ ఫెడ్..

మొదటిపేజీ తరువాయి

ఈ ఈవెంట్‌కు ఆతిథ్యమివ్వడం ఇదే తొలిసారి కావడంతో స్థానిక పెట్ లవర్స్‌లో మంచి ఆసక్తి నెలకొంది.ఈసారి పెట్ ఫెడ్ తన 12వ ఎడిషన్‌లోకి అడుగుపెట్టింది. నవంబర్ 2026 నుంచి మార్చి 2027 వరకు దేశంలోని ఐదు ప్రధాన నగరాల్లో ఈ ఫెస్టివల్ పర్యటించనుంది. హైదరాబాద్‌తో మొదలయ్యే ఈ ప్రయాణం అనంతరం ఢిల్లీ, బెంగళూరు, పూణే మీదుగా ముంబైలో ముగుస్తుంది.రెండు రోజుల పాటు సాగే ఈ వేడుకలో పెంపుడు జంతువుల కోసం పలు రకాల ఆకర్షణీయమైన పోటీలు, ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. 'పెట్స్ గాట్ టాలెంట్', ప్రత్యేక ఫ్యాషన్ షో, క్యాటాపలూజా, ఇంటర్నేషనల్ క్యాట్ షో, సెక్యూరిటీ డాగ్ షో వంటి ఈవెంట్లు సందర్శకులను విశేషంగా అలరించనున్నాయి. వీటితో పాటు దేశీయ జాతి శునకాల యజమానుల (ఇండీ పెట్ పేరెంట్స్) కోసం ప్రత్యేక కార్యక్రమాలు, జంతువుల ఆటపాటల కోసం డెడికేటెడ్ ప్లే, ఎజిలిటీ జోన్లు సిద్ధం చేస్తున్నారు.పెంపుడు జంతువులను దత్తత తీసుకోవాలనుకునే వారి కోసం ప్రత్యేకంగా 'అడాప్షన్ జోన్లు' ఏర్పాటు చేయనున్నారు. అలాగే పెట్స్ పెంపకం, ఆరోగ్యం, ప్రవర్తన తదితర అంశాలపై సందేహాలు నివృత్తి చేసేందుకు నిపుణులతో మాస్టర్‌క్లాస్‌లు నిర్వహిస్తారు. వీటితో పాటు పెట్ ఉత్పత్తులకు సంబంధించిన షాపింగ్ స్టాళ్లు కూడా అందుబాటులో ఉంటాయి.

ఈ వేడుక గురించి సంస్థ వ్యవస్థాపకుడు అక్షయ్ గుప్తా మాట్లాడుతూ.. పెట్ ఫెడ్ అనేది కేవలం ఒక సాధారణ ఫెస్టివల్‌గా మాత్రమే మిగిలిపోలేదని, ఇది పెంపుడు జంతువుల ప్రేమికులందరినీ ఏకం చేసే ఒక పెద్ద కమ్యూనిటీగా ఎదిగిందని పేర్కొన్నారు. మూగజీవాల పట్ల అవగాహన, వాటి సంరక్షణ బాధ్యతను మరింత పెంచడమే ఈ వేదిక ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు.

తెలంగాణ ప్రజలకు రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలి: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

ప్రజలకు రాహుల్ గాంధీ వెంటనే సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో 'అభయ హస్తం' పచ్చి అబద్ధాల పుట్ట అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజల సొమ్ముతో హైదరాబాద్‌లో పర్యటిస్తున్న రాహుల్ గాంధీ... కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారెంటీలపై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. బీసీ డిక్లరేషన్‌లో భాగంగా రూ. 1 లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని చెప్పి, మూడేళ్లలో రూ. 5,000 కోట్లు కూడా కేటాయించలేదని కేటీఆర్ ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల హామీని కూడా గాలికి వదిలేశారని మండిపడ్డారు.అలాగే ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికి, కేవలం 10 వేల ఉద్యోగాలతో సరిపెట్టారని విమర్శించారు. విద్యార్థులకు రూ. 5 లక్షల విద్యా భరోసా కార్డులు, పేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ. 12 లక్షల చొప్పున ఇచ్చే అంబేద్కర్ అభయ హస్తం సాయం, మైనార్టీల నిధుల కేటాయింపుల్లోనూ ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులు, రైతుల సమస్యలపై రాహుల్ గాంధీ ఎందుకు స్పందించడం లేదని కేటీఆర్ నిలదీశారు.

అక్రమ అరెస్టులతో బీజేపీని ఆపలేరు

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ నేతలు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

అక్రమ అరెస్టులతో బీజేపీని ఆపలేరని పేర్కొన్నారు. రాష్ట్రం తీవ్ర కష్టాల్లో ఉన్నా పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజల సొమ్మును వెచ్చించి సమ్మిట్లు నిర్వహించడం దారుణమన్నారు. గతంలో రాహుల్‌గారొధీ విదేశాలకు వెళ్లి భారతదేశ ఆర్థిక వ్యవస్థను డెడ్ ఎకానమీ అంటూ అవమానించారని, ఇప్పుడు విదేశీయులను ఇక్కడికి తీసుకువచ్చి భారత్‌పై విషం చిమ్మించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కాగా, భారత్ సమ్మిట్ అట్టర్ ఫ్లాప్ అయిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. వేదికపై నుంచి రాహుల్‌గాంధీ మధ్యలో వెళ్లిపోవడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. విదేశీ ప్రతినిధుల ముందు భారత్ ప్రతిష్ఠను దిగజార్చేలా రాహుల్ మాట్లాడారని మండిపడ్డారు. విదేశీయుల ముందు భారత్‌ను అవమానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

ఇది ముమ్మాటికి దేశద్రోహమేనని మండిపడ్డారు. భారత్ సమ్మిట్ పేరుతో దేశాన్ని వ్యతిరేకించే శక్తులన్నీ ఒకే వేదికపైకి వచ్చాయని ఆరోపించారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న రాహుల్.. ముందుగా కాంగ్రెవీసలో ప్రజాస్వామ్యం ఉందో లేదో చెప్పాలని నిలదీశారు. ఎమర్జెన్సీ విధించి రాజ్యాంగ హక్కులను కాలరాసి లక్షలాది మందిని జైళ్లలో పెట్టిన చరిత్ర కాంగ్రెవీసదేనన్నారు. కాగా, కరువుతో రాష్ట్ర ప్రజలు అల్లాడుతుంటే.. భారత్ సమ్మిట్ పేరిట దేశ వ్యతిరేక శక్తులతో సమావేశం పెట్టాల్సిన అవసరం ఏంటని ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. కనీసం ఎన్నికలు కూడా జరగని 42 ఇస్లామిక్ రాచరిక దేశాలు రాహుల్‌కు ఆదర్శమయ్యాయా? అని నిలదీశారు. నాటి ప్రధాని పీవీ నరసింహారావు స్వయంగా వాజ్‌పేయిని ఐక్యరాజ్యసమితికి పంపి భారత ఆత్మగౌరవాన్ని నిలబెట్టారని గుర్తుచేశారు. నేడు రాహుల్ మాత్రం విదేశాల్లో దేశం పరువు తీస్తున్నారని ఆయన మండిపడ్డారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
ఆదివారం15 నవంబర్ 2026

డిసెంబర్ 9 చలో హైదరాబాద్ విజయవంతం చెయ్యండి



వాజేడు,నవంబర్ 14,(ప్రజావినికిడి):ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ తలపెట్టిన, చలో హైదరాబాద్ డిసెంబర్ 9 కార్యక్రమం అనుసరించి వాజేడు మండల అధ్యక్షుడు అట్టం శివకుమార్, అధ్యక్షన ఏర్పాటుచేసిన తుడుం దెబ్బ నాయకుల సమావేశంలో తుడుం దెబ్బ రాష్ట్ర ప్రచార కార్యదర్శి రేగ గణేష్ పాల్గొని, ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ ఏర్పాటు చేసినటువంటి హైదరాబాద్ నడిబొడ్డున భారీ బహిరంగ సభను లక్ష విల్లంబులతో విజయవంతం చెయ్యాలంటే,తుడుం దెబ్బ నాయకులు ప్రతి ఒక్కరూ ప్రతి గ్రామంలో పటేళ్లను, సర్పంచులను, యువత, మహిళలను కలిసి ఆదివాసులకు జరుగుతున్న విద్య,ఉద్యోగం, భూమి,ఉపాధి, పై జరుగుతున్న అన్యాయాలను తెలియజేస్తూ గ్రామ కమిటీలు వెయ్యాలని తెలియజేయడం జరిగింది. అరుణ్ అన్న తలపెట్టిన లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలనే నినాదం లంబాడి వాళ్ల గుండెల్లో భయం పుట్టి మైపత్ అరుణ్ కుమార్ అన్న మీద అక్రమ కేసులు పెడుతు సభను అడ్డుకునే ప్రయత్నాలు చేసిన తుడుం దెబ్బ ఉద్యమం ఆగదని ఆయన హెచ్చరించారు, డిసెంబర్ 9 చలో హైదరాబాద్ బహిరంగ సభకి అన్ని ఆదివాసి సంఘాల నాయకులు, ఉద్యోగులు, మహిళలు, యువత, ఆదివాసులు ఐక్యంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రకార్య వర్గ సభ్యులు చింత మోహన్,ములుగు జిల్లా కార్య దర్శి గొంది రామ్ లక్స్ మన్, పాయం,కృష్ణ, వాజీడు మండల ప్రధాన కార్యదర్శి, మోడెం సందీప్,శాఖ మండల అధ్యక్షులు గొంది మోరళి,ఉపాధ్యక్షుడు అట్టం సంపత్ ఆది వాసి సీనియర్ నాయకులు బొద బోయిన సురేష్, కారం రామకృష్ణ, మోడెం రామకృష్ణ,శేషు సాగర్,మండల నాయకులు పాల్గొన్నారు.

చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా పల్లకీ సేవ



షాద్ నగర్,(ప్రజావినికిడి):మున్సిపాలిటి పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు.శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకిలో మోస్తూ శ్రీరామ జయరామ,జయ జయ రామ నినాదాలతో ఆట పాటలతో, భజనలతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు.భక్తి పాటలు భజనలతో ఆలయంలో శ్రీ రామ నామస్మరణతో మార్మోగింది.ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రాచార్య,అర్చకులు, ప్రమోద్,సునీల్ పంతులు ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలుఅందజేశారు.అనంతరం దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో భక్తులు,భజన భక్త బృందం మహిళలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త సారథి.. మీనాక్షి స్థానంలో బీఎం సందీప్

హైదరాబాద్,నవంబర్ 14:(ప్రజావినికిడి):



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) వ్యవహారాల ఇన్‌చార్జిగా బీఎం సందీప్‌ను నియమిస్తూ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) శనివారం కీలక నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదంతో ఈ నియామకం జరిగినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు ఈ బాధ్యతల్లో ఉన్న మీనాక్షి నటరాజన్ స్థానంలో సందీప్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని ఏఐసీసీ స్పష్టం చేసింది.కొత్త ఇన్‌చార్జిగా నియమితులైన సందీప్‌కు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అభినందనలు తెలిపారు. మీనాక్షి నటరాజన్ పార్టీ బలోపేతానికి, సంస్థాగత నిర్మాణానికి విశేష కృషి చేశారని, సందీప్ నాయకత్వంలో పార్టీ మరింత బలపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఘనంగా బాలల దినోత్సవం



వాజేడు,నవంబర్ 14,(ప్రజావినికిడి):
గుమ్మడిదొడ్డి గ్రామపంచాయతీ లో జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా సర్పంచ్ బోదెబోయిన భరత్ కుమార్ అధ్యక్షతనలో బాలల గ్రామ సభను పెట్టడం జరిగినది ఈ సందర్భంగా సర్పంచ్ సందేశం బాలలే బావి తరాల భారత నిర్మాతలు.. వారి చిరు నవ్వుల్లోనే దేశ భవిష్యత్తు ఉంది
పిల్లలే దేశానికీ నిజమైన సంపద అని నమ్మిన నెహ్రూ బాలల అభ్యున్నతి విద్య విజ్ఞానం సమానత్వం కోసం ఎంతో ప్రాధాన్యత ఇచ్చినారు అయన జన్మదినం నవంబర్ 14న బాలల దినోత్సవం గా జరుపుకోవడం మనందరికీ గర్వకారణం ప్రతి చిన్నారి కలలకు రెక్కలు తోడిగిన నాణ్యమైన విద్యను అందించి సమాజంలో సమాన
అవకాశలు కల్పించినప్పుడే బలమైన అభివృద్ధి చెందిన దేశంగా భారత దేశాన్ని నిర్మించగలం బాలల హక్కులను కాపాడుదాం వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేద్దాం జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా పిల్లలకు శుభాకాంక్షలు తెలుపుతున్న గుమ్మడిదొడ్డి గ్రామ పంచాయతీ సర్పంచ్ బోదెబోయిన భరత్ కుమార్, ఉప సర్పంచ్ బండారి రాజశ్రీ ఈ యొక్క కార్యక్రమానికి పంచాయితీ సెక్రటరీ ప్రవీణ్, వార్డు సభ్యులు, అంగన్వాడీ మేడలు ఆశవర్కర్లు మరియు సిఎస్ఎం,జయసుధ,పిల్లలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కొండారెడ్డిపల్లి చిన్న రేవల్లి గ్రామాల మధ్య మట్టి రోడ్డు పనులు ప్రారంభం



షాద్ నగర్,(ప్రజావినికిడి):
నియోజకవర్గంలోని కేశంపేట మండలం కొండారెడ్డిపల్లి గ్రామం నుంచి చిన్న రేవల్లి గ్రామశివారు వరకు మంజూరైన మట్టి రోడ్డు పనులు శనివారం ప్రారంభమయ్యాయి.షాద్‌నగర్ ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ సహకారంతో మంజూరైన ఈ పనులను గ్రామ సర్పంచ్ పల్లె ఆనంద్ కుమార్, షాద్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తిప్పిశెట్టి కరుణాకర్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. గత కొంతకాలంగా ఈ రహదారి గుంతలమయంగా మారడంతో రైతులు,వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనుల నిమిత్తం రాకపోకలు సాగించే రైతులకు రహదారి సమస్య ఇబ్బందికరంగా మారింది.ఈ సమస్యను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి మట్టి రోడ్డు మంజూరుకు సహకరించారు. దీంతో రహదారి పనులుశీ ప్రారంభం కావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు,గ్రామ పెద్దలు,కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కరెంటు పోల్స్ సమస్యకు పరిస్కారం చూపిన సర్పంచ్



వాజేడు,నవంబర్ 14,(ప్రజావినికిడి):వాజేడు మండలం చెరుకూరు గ్రామ పంచాయతీ పరిదిలో రేగులపాడు గ్రామంలో కరెంటు పోల్స్ క్రమ పద్ధతిలో లేకపోవడంతో కరెంటు వైర్లు ఇండ్ల పైనుండి ఉండటంతో ఈ విషయం జూన్ లో సర్పంచుకి గ్రామస్తులు తెలియజేసారు వెంటనే సర్పంచ్, పాలకవర్గ సభ్యులు సంబందిత అధికారి ఎఈ,తో మాట్లాడటం జరిగింది వెంటనే స్పందించిన ఎఈ, జూన్ 8వ, తేదిన సర్వే చేసి మంజూరు చెయ్యడంతో రోడ్డు మార్గంలో చెట్లు ఉండటంతో సర్పంచ్ వెంటనే జెసిబితో చెట్లను తోలగించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు ఈనెల 11, బుధవారం నుండి శుక్రవారం వరకు వీదుల వెంట కొత్త కరెంట్ పోల్స్ వెయ్యడం జరిగింది అని సర్పంచ్ వాసం రాజబాబు తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ ఎఈ, జెఈ,ఎల్ఐ, సిబ్బంది పాల్గొన్నారు

డా:అమ్మినకు, నారం శెట్టి జాతీయ బాలసాహిత్య పురస్కారం

వాజేడు,నవంబర్ 14,(ప్రజావినికిడి):



స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు ఉపన్యాసకులు, ప్రముఖ బాల సాహితీ వేత్త డా:అమ్మిన శ్రీనివాసరాజు కు 2026 సంవత్సరంకు గాను నారంశెట్టి జాతీయ స్థాయి బాలసాహిత్య పురస్కారం ప్రకటించారు, ఆంధ్రప్రదేశ్ కు చెందిన మన్యం జిల్లా పార్వతీపురం లోని "నారం శెట్టి బాల సాహిత్య పీఠం" ప్రతి ఏటా తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు బాలసాహితీవేత్తలకు జాతీయస్థాయి బాల సాహిత్య పురస్కారం ఇస్తున్నారు, అందులో భాగంగా 2026 సంవత్సరానికి తెలంగాణకు చెందిన డాక్టర్ అమ్మిన శ్రీనివాసరాజును ఈ పురస్కారం కోసం ఎంపిక చేశారు.వచ్చే నెలలో జరగబోయే ప్రత్యేక కార్యక్రమంలో పురస్కార గ్రహీతకు 6000 రూపాయల నగదు జ్ఞాపికతో సత్కరించనున్నట్టు సాహిత్య పీఠం వారు తెలియజేశారు.కళాశాలకు చెందిన తెలుగు ఉపన్యాసకునికి రాష్ట్రస్థాయి పురస్కారం లభించడం పట్ల ప్రధాన చార్యులు అలాగే కళాశాల ఉపన్యాసక బృందం అభినందనలు తెలియజేశారు.మండలానికి చెందిన పరిశోధకరచయితకు లభించిన గౌరవానికి గాను మండలంలోని విద్యావేత్తలు అధికారులు ఆయనను అభినందించారు.

చెరుకూరులో కారు ప్రమాదం



వాజేడు,నవంబర్ 14,(ప్రజావినికిడి):వాజేడు మండలం చెరుకూరు చివరలో శనివారం ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు ఈ ప్రమాదంలో హైదరాబాద్ కు చెందిన వ్యక్తి గాయపడినట్టు తెలుస్తుంది హైదరాబాద్ కి చెందిన కుటుంబ సభ్యులు బీజాపూర్ చుట్టాల వద్దకు వెళ్లి తిరిగి వస్తున్నా క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది ప్రమాద సమయంలో బెలూన్లు తెరుసుకోవడంతో పెద్ద ప్రమాదం నుంచి ఆ కుటుంబం తప్పించుకుంది డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి మాత్రం గాయపడినట్టు స్థానికులు తెలిపారు ఈ ప్రమాదం ఒక వ్యక్తిని తప్పించబోయి ఆ వ్యక్తి డీకొట్టి,ఆగి ఉన్న లారీకి ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు.పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

పాదయాత్ర చేసిన ఎమ్మెల్యే కాలేరు



అంబర్ పేట్, (ప్రజావినికిడి): అంబర్ పెట్ డివిజన్ ప్రేమ్ నగర్ ఐస్ ఫ్యాక్టరీ గల్లి నుండి అలీ కేఫ్ చౌరస్తా వరకు స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్,మాజీ కార్పోరేటర్ విజయ్ కుమార్ గడ్‌తో కలిసి పాద యాత్ర నిర్వహించారు. అన్ని శాఖల ఉన్నతాధికారులతో కలిసి స్థానికుల సమస్యలను అధికారులతో చర్చించి వీలైనంత త్వరగా మంచినీటి, విద్యుత్ సమస్య, వీధి దీపాల సమస్యను సత్వరం పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు.వాటర్ వర్క్స్ గేటు నుండి అలికేఫ్ చౌరస్తా వరకు దాదాపు కోటిన్నర ఖర్చుతో కూడిన నూతన సీసీ రోడ్డును వేశారు. త్వరలోనే అద్భుతమైన నర్సరీని ఏర్పాటు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జలమండలి జిఎం శ్రీధర్ రెడ్డి, డీజీఎం కృష్ణ, ట్రాఫిక్ సిఐ కౌశిక్, ఎస్ఐ రాకేష్, డిఈ ప్రవీణ్, ఏఈ నజీర్, పవన్,విద్యుత్ ఏఈ శ్రీనివాస్, వర్క్ ఇన్స్పెక్టర్లు రమేష్,దుర్గ, స్థానిక బస్తీ ప్రజలు, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి జాఫర్, సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వాకర్స్‌కు అనుకూలంగా గేటుని నిర్మిస్తాం

చైతన్యపురి,(ప్రజావినికిడి):



చైతన్యపురి డివిజన్ పరిధిలోని ప్రభాత్ నగర్ పార్కును గత వారం రోజుల క్రితం ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సందర్శించిన విషయం తెలిసిందే.దానిలో భాగంగా వాకర్స్ మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా ప్రభాత్ నగర్ పార్కులో ప్రతిరోజూ వాకింగ్ చేస్తున్నామని,వందలాది మంది స్థానికులు ఈ పార్కుపైనే ఆధారపడి ఉన్నారని తెలిపారు.అయితే పక్కనే నిర్మాణంలో ఉన్న టీమ్స్ హాస్పిటల్ యాజమాన్యం పార్కు వద్ద గేటు ఏర్పాటు చేయనున్నట్లు తెలియడంతో ఆందోళన వ్యక్తం చేశారు.గేటు ఏర్పాటు చేస్తే పార్కులో వాకింగ్ చేయడానికి సరిపడా స్థలం లేకుండా పోతుందని,
ఇప్పటికే వినియోగంలో ఉన్న పార్కును రెండు భాగాలుగా విభజించడం సమంజసం కాదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి స్పందిస్తూ గతంలో ఇట్టి టీమ్స్ హాస్పిటల్ శంకుస్థాపన కార్యక్రమంలో అప్పటి ముఖ్యమంత్రి
కెసిఆర్ ని కలిసి ఇటు టీమ్స్ హాస్పిటల్ నందు పోలీస్ స్టేషన్,చిల్డ్రన్స్ పార్క్,వాటర్ ట్యాంక్,సబ్ స్టేషన్,తదితర స్థలం కేటాయించాలని కోరగా వారు వెంటనే స్పందించి దానికి సంబంధించిన జీ.వో.ఇవ్వడం జరిగింది.దానిలో భాగంగా సుధీర్ రెడ్డి వారం రోజుల క్రితం కాలనీవాసులను జోనల్ కమిషనర్ దగ్గరికి తీసుకెళ్లి గేటు విషయం చర్చించడం జరిగింది.అట్టి పార్కులో ఎట్టి పరిస్థితుల్లో గేటు పెట్టకుండా చూడాలని కోరడం జరిగింది. వారు సానుకూలంగా స్పందించారు.శనివారం రోజు పలువురు ఇంజనీర్ అధికారులు అట్టి పార్కు స్థలం దగ్గరికి రావడం జరిగింది.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి ఇట్టి పార్కులో నుండి గేటు పెట్టకుండా అట్టి పార్కు పక్కనే ఉన్న దేవాలయం ప్రక్కన గేటు నిర్మిస్తే ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు.అలాగే దేవాలయం పక్కన గేటు నిర్మిస్తే పక్కన ఉన్న వాచ్మెన్ రూమ్ కొంతమేర తొలగించాల్సి వస్తున్న నేపథ్యంలో వాచ్ మెన్ కు నూతన రూమ్ నిర్మించి అలాగే పార్కు నందు వాకింగ్ ట్రాక్ కూడా పునరుద్ధరణ చేయాలని కోరారు.దానికి అధికారులు దేవాలయం ప్రక్కన ఉన్న అట్టి స్థలాన్ని పరిశీలించి గేటు దేవాలయం పక్కనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.దానికి కాలనీవాసులు సుధీర్ రెడ్డికి ధన్యవాదములు తెలిపారు.ఈ కార్యక్రమంలో సరూర్ నగర్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్,ఇంజనీరింగ్ అధికారులు విశ్వకుమార్,
అనిత,భారతి మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి,తోట మహేష్ యాదవ్,చంద్రశేఖర్ రెడ్డి,త్రివేది, జయశ్రీ,విశ్వ ప్రేమ్,గట్టు శీను,రమణారెడ్డి,కాలనీ అధ్యక్షులు బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ గో బ్యాక్

నిరుద్యోగ జేఏసీ నేత ఇంద్ర నాయక్



ముషిరాబాద్, (ప్రజావినికిడి): హైదరాబాద్ లో భారత్ సమ్మిట్ కీ వచ్చిన రాహుల్ గాంధీ ముందుగా ఎలక్షన్ సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాకే తెలంగాణలో అడుగు పెట్టాలని నిరుద్యోగ జేఏసీ నేతలు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులతో కలిసి చాయ్ తాగిన రాహుల్ గాంధీ ఇప్పుడు ఎందుకు కలవడంలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చక పోవడంతోనే నిరుద్యోగులను కలిసే మొహం లేకనే చాటేస్తున్నారని ఎద్దేవ చేశారు. నిరుద్యోగులను మరీ లైబ్రరీ కీ వచ్చి అరెస్టులు చూపిస్తున్నారని మండిపడ్డారు. నిజం గా కాంగ్రెస్ పార్టీ ఉద్యోగాలను భర్తీ చేసి ఉంటే రాత్రి కీ రాత్రే నిరుద్యోగ జేఏసీ నేతలను అక్రమంగా అరెస్ట్ చేయాల్సిన అవసరం ఉంటుందని ప్రశ్నించారు సిటీ సెంట్రల్ లైబ్రరీలో చదవడానికి లోనికీ వెళ్లిన వారిని ఈడ్చుకోచ్చి మరీ అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏముందని నిలదీశారు.ప్రజా ప్రభుత్వమని చెప్పుకునే కాంగ్రెస్ నేతలు ఇదేనా వీరి ప్రజాస్వామ్యం అని ప్రశ్నించారు. తక్షణమే ఉద్యోగ ప్రకటనలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేని పక్షంలో కాంగ్రెస్ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. బీఆర్ఎస్ కు పట్టిన గతి కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. త్వరలేనే 2 లక్షల ఉద్యోగాల భర్తీ, నెలకు 4 వేల రూపాయలు ఏమ్యాయని ప్రశ్నించారు. స్వయంగా 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన రాహుల్ గాంధీ తెలంగాణ యువతకీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అక్రమంగా అరెస్ట్ చేసి చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు. అరెస్ట్ అయినా వారిలో నిరుద్యోగ జేఏసీ నేతలు శంకర్ నాయక్, నరేష్,ఇంద్ర నాయక్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నూతన గ్రంథాలయం

ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్





షాద్‌నగర్,(ప్రజావినికిడి):మున్సిపాలిటీ పరిధిలోని ఫరూఖ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారతదేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్,మండల విద్యాధికారి మనోహర్,కౌన్సిలర్ లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తక పఠనం అలవాటుగా మారాలని,గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు,క్రమశిక్షణ,వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని పేర్కొన్నారు.ప్రతి విద్యార్థి పాఠ్యపుస్తకాలతో పాటు వివిధ విజ్ఞాన,చారిత్రక,సాహిత్య పుస్తకాలను చదివే అలవాటు పెంచుకోవాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడేలా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి,కౌన్సిలర్లు,ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో దొంగతనం గుట్టురట్టు

నిందితురాలిని పట్టుకున్న షాద్ నగర్ పోలీసులు -మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన పట్టణ సీఐ సీతారాం

షాద్ నగర్,(ప్రజావినికిడి):

పట్టణంలో బంగారు నగల దుకాణంలో జరిగిన చోరీ కేసును షాద్‌నగర్ పోలీసులు కేవలం 24 గంటల్లోనే ఛేదించారు.అటెన్షన్ డైవర్షన్ పద్ధతిలో రెండున్నర తులాల బంగారు గొలుసును చోరీ చేసిన మహిళనుసీసీకెమెరాలు,సాంకేతిక ఆధారాలతో గుర్తించి పట్టుకున్నారు.

ఈ కేసుకు సంబంధించిన వివరాలను పట్టణ సీఐ సీతారాం మీడియా సమావేశంలో వెల్లడించారు.

షాద్‌నగర్ చౌరస్తాలోని శ్రీకృష్ణ జ్యువెలరీస్‌లో గురువారం మధ్యాహ్నం సుమారు 2:30 గంటల సమయంలో ఈ చోరీ జరిగింది.షాపు యజమాని కుట్ర రఘువీర్ గుప్తా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు,నిందితురాలు రాజమణి (40-45),భర్త నరసింహులు, మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం పుల్మాంపల్లి గ్రామానికి చెందిన మహిళగా పోలీసులు గుర్తించారు.ఆమె జ్యువెలరీ షాపులో అటెన్షన్ డైవర్షన్‌కు పాల్పడి షోకేస్‌లో ఉన్న రెండున్నర తులాల బంగారు గొలుసును అపహరించి వెళ్లిపోయింది.

చాకచక్యంగా నిందితురాలి చోరీ పద్ధతి

ముందుగా వెంకటరమణ జ్యువెలరీ షాపుకు వెళ్లి అక్కడ అటెన్షన్ డైవర్షన్ ద్వారా చోరీ చేసేందుకు ప్రయత్నించినప్పటికీ విఫలమైంది.అనంతరం శ్రీకృష్ణ జ్యువెలరీస్‌కు చేరుకుని చెవి కమ్మలు చూపించమని



అడుగుతూ సిబ్బంది దృష్టిని మరల్చి షోకేస్‌లో ఉన్న బంగారు గొలుసును చాకచక్యంగా దొంగిలించి అక్కడి నుంచి వెళ్లిపోయింది.

చోరీ జరిగిన 24 గంటల్లోనే కేసు ఛేదింపు

బాధితుల ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి సీసీ కెమెరాల ఫుటేజ్ సహకారంతో పాటు సాంకేతిక ఆధారాలను విశ్లేషించారు. పక్కా ఆధారాలతో నిందితురాలిని గుర్తించి కేవలం 24 గంటల్లోనే కేసును ఛేదించారు. ఈ ఆపరేషన్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి, డీసీపీ శిరీష రాఘవేంద్ర, ఏసీపీ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో సాగింది.డీఎస్ఐ శివారెడ్డి,జోనల్ టీమ్ సభ్యులు హరి,జాకీర్,మహేష్,అశోక్ రెడ్డి, సంతోష్,మోహన్ చాకచక్యంగా వ్యవహరించి నిందితురాలిని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి.

ఈ సందర్భంగా పోలీసులు షాద్‌నగర్ పట్టణ ప్రజలకు, వ్యాపార సంస్థల యజమానులకు కీలక సూచనలు చేశారు.ప్రతి ఒక్కరూ తమ షాపుల్లో,ఇళ్ల వద్ద నాణ్యమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల ఇలాంటి నేరాలను త్వరగా గుర్తించి, నిందితులను పట్టుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

దాతునగర్ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



హైదరాబాద్,(ప్రజావినికిడి):మండల పరిధిలోని దాతునగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్)లో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులకు బాలల దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ,నైతిక విలువలు, సృజనాత్మకతను అలవర్చుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం వేడుకల్లో పాల్గొని చిన్నారులను అభినందించి ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి, ఉపాధ్యాయులు వర్షిణి,మంజుల, నాగలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. అందరి సమక్షంలో బాలల దినోత్సవ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ముగిశాయి.

సైబర్ నేరాలు,గంజాయి రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం

కొత్తూర్ సీఐ నాగార్జున రెడ్డి



కొత్తూరు,(ప్రజావినికిడి):

ప్రజలకు,యువతకు సైబర్ నేరాలు,రోడ్డు ప్రమాదాలు,గంజాయి వల్ల కలిగే అనర్థాలపై ఉద్యోగులు అవగాహన కలిగి ఉండాలని కొత్తూర్ సీఐ నాగార్జున రెడ్డి సూచించారు.

కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ బిర్లా కంపెనీలో సుమారు 120 మంది ఉద్యోగులకు కొత్తూరు సీఐ నాగార్జున రెడ్డి సైబర్ నేరాలు,రోడ్డు ప్రమాదాలు, గంజాయి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, ప్రజలకు గంజాయి వలన కలిగే అనర్థాలపై,సైబర్ నేరాలపై,రోడ్డు ప్రమాదలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సిఐ నాగార్జున రెడ్డి తెలిపారు.గంజాయి,పేకాట,పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నాగార్జున రెడ్డి హెచ్చరించారు.

పాటలతో పరవశింపజేస్తున్న బాల గాయని అక్షర.!

చిన్నారి గాన మాధుర్యానికి పోలీసు ఉన్నతాధికారులు ఫిదా..

శాలువాతో సత్కరించి ఆశీర్వదించిన వీసీ సజ్జనార్



చిల్డ్రన్స్ డే స్పెషల్..

హైదరాబాద్,(ప్రజావినికిడి):

పిట్ట కొంచెం.. కూత ఘనం అన్న చందంగా పదేళ్ల ప్రాయంలోనే తన గాన ప్రతిభతో అందరినీ అబ్బురపరుస్తున్న వర్ధమాన బాల గాయని అక్షర ప్రశంసల వర్షంలో తడుస్తోంది. ఆమె గొంతులో పలికే పాటలు సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేస్తుండగా, ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకోవడం ఆమె ప్రతిభకు మరో గుర్తింపుగా నిలిచింది. చిన్నారి అక్షర ఆలపించిన పలు పాటలను స్వయంగా వీక్షించిన ఫైర్ సర్వీసెస్ డీజీ వీసీ సజ్జనార్ ఆమె గాన ప్రతిభకు ముగ్ధులయ్యారు. చిన్నారి ప్రతిభను ప్రత్యేకంగా అభినందించడమే కాకుండా, స్వయంగా శాలువా కప్పి ఘనంగా సత్కరించి ఆశీర్వదించారు. అక్షర పాటలు విన్న ఇతర పోలీసు ఉన్నతాధికారులు సైతం ఆమె ప్రతిభను ప్రశంసిస్తూ భవిష్యత్తులో గొప్ప గాయనిగా ఎదగాలని ఆకాంక్షించారు. పదేళ్ల చిన్న వయసులోనే సంగీతం, సాహిత్యంపై మంచి పట్టుతో అక్షర ఆలపిస్తున్న పాటలు శ్రోతలను కట్టిపడేస్తున్నాయి. పాటలోని భావాన్ని పలికించే తీరు, స్వరంలోని మాధుర్యం, గానంలోని పరిణతి చూస్తుంటే ఆమెలో అపారమైన



ప్రతిభ దాగి ఉందని ప్రశంసిస్తున్నారు. చిన్న వయసులోనే ఇంతటి ప్రతిభ కనబరుస్తున్న అక్షర భవిష్యత్తులో సంగీత ప్రపంచంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటుందని పోలీసు అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ తస్వీక్ ఇక్బాల్ ఐపీఎస్, రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, చంద్రాయణగుట్ట ఏసీపీ శ్రీనివాస్, ఫలక్‌నుమా ఏసీపీ జావేద్, రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్, అత్తాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య తదితర పోలీసు అధికారులు అక్షర ప్రతిభను అభినందించారు.

బాలల దినోత్సవం సందర్భంగా అక్షరకు హృదయపూర్వక శుభాకాంక్షలు. తండ్రి యాదగిరి ప్రోత్సాహం, సహకారం,పెద్దల ఆశీస్సులతో అక్షర తన గాన ప్రతిభకు మరింత పదును పెట్టుకుని సంగీత ప్రపంచంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు. చిన్నారి గొంతులో వినిపిస్తున్న ఈ స్వర మాధుర్యం రేపటి రోజున ఎన్నో వేదికలను అలరించాలని మనస్ఫూర్తిగా కోరుకుందాం..



36 గంటల నిరీక్షణకు తెర..

మైక్రోసాఫ్ట్ సేవలన్నీ మళ్లీ అందుబాటులోకి!

ఔట్‌లుక్, టీమ్స్, కోపైలట్ సహా 365 సేవలు అందుబాటులోకి

నెట్‌వర్క్ సామర్థ్య విస్తరణకు సంబంధించిన సాంకేతిక సమస్యే కారణమని వెల్లడి

సైబర్ దాడి లేదా ఏఐ ప్రమేయం లేదని స్పష్టీకరణ

అసౌకర్యానికి క్షమాపణలు చెప్పిన మైక్రోసాఫ్ట్



నవంబర్ 14(ప్రజావినికిడి):

ప్రపంచవ్యాప్తంగా 36 గంటలకు పైగా నిలిచిపోయిన మైక్రోసాఫ్ట్ సేవలను ఎట్టకేలకు పునరుద్ధరించారు. ఔట్‌లుక్, మైక్రోసాఫ్ట్ టీమ్స్, కోపైలట్‌తో పాటు మైక్రోసాఫ్ట్ 365కు చెందిన ఇతర సేవలు మళ్లీ అందుబాటులోకి వచ్చినట్లు సంస్థ శనివారం వెల్లడించింది. సాంకేతిక సమస్యను పరిష్కరించేందుకు చేపట్టిన చర్యలు పూర్తయ్యాయని తెలిపింది. అయితే వ్యవస్థలు, ఈమెయిల్ పెండింగ్ సందేశాల పరిస్థితిని ఇంకా పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొంది.

నవంబర్ 12, గురువారం ఎక్స్ఛేంజ్ ఆన్‌లైన్ మెయిల్‌బాక్స్‌లను వినియోగించడంలో సమస్యలు మొదలయ్యాయి. ఆ తర్వాత ఔట్‌లుక్, టీమ్స్, కోపైలట్, షేర్‌పాయింట్, ప్లానర్, టు డూ వంటి సేవలకూ అంతరాయం విస్తరించింది. టీమ్స్‌లో సాధారణ సందేశాలు, ఆన్‌లైన్ సమావేశాలు చాలావరకు పనిచేసినా.. క్యాలెండర్లు, సమావేశాల షెడ్యూలింగ్ వంటి ఎక్స్ఛేంజ్ ఆధారిత సదుపాయాలు ప్రభావితమయ్యాయి. కోపైలట్‌లో చాట్‌లు తెరవడం, ఈమెయిల్స్, క్యాలెండర్లు, ఫైళ్లకు సంబంధించిన సమాచారాన్ని పొందడంలోనూ ఇబ్బందులు ఎదురయ్యాయి.

గతంలో చేపట్టిన నెట్‌వర్క్ సామర్థ్య విస్తరణకు సంబంధించిన సాంకేతిక సమస్య.. ఇటీవల చేసిన మరో నెట్‌వర్క్ మార్పు తర్వాత బయటపడినట్లు మైక్రోసాఫ్ట్ గుర్తించింది. ఈ ఘటనకు సైబర్ దాడి లేదా ఏఐ ఏజెంట్ కారణం కాదని స్పష్టం చేసింది. సేవలను ఒక్కసారిగా పునరుద్ధరించకుండా, ఒక్కో దశలో స్థిరత్వాన్ని పరిశీలిస్తూ తిరిగి అందుబాటులోకి తెచ్చినట్లు మైక్రోసాఫ్ట్ వివరించింది. ఆలస్యమైన ఈమెయిల్స్ తిరిగి అందేందుకు, పెండింగ్ సందేశాలను ప్రాసెస్ చేసేందుకు టైమ్‌అవుట్ వ్యవధిని 48 గంటలకు పెంచింది. వినియోగదారులు, భాగస్వాములకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు తెలిపింది. ఘటనపై విచారణ పూర్తయ్యాక ఏం జరిగిందో వివరించే నివేదికను విడుదల చేస్తామని ప్రకటించింది.

ఈ ఘటనతో క్లౌడ్ సేవలపై సంస్థలు అతిగా ఆధారపడటంపై మరోసారి చర్చ మొదలైంది. ప్రముఖ సాంకేతిక వేదికలు పనిచేయని పరిస్థితుల్లోనూ కార్యకలాపాలు కొనసాగించేందుకు ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధంగా ఉంచుకోవాల్సిన అవసరాన్ని ఈ అంతరాయం గుర్తుచేసింది.

శ్రీకాళహస్తి ఆలయంలో స్పై కెమెరా కళ్లజోడు కలకలం..

భక్తుడిని అదుపులోకి తీసుకున్న ఎస్పీఎఫ్



శ్రీకాళహస్తి నవంబర్ 14 (ప్రజావినికిడి):

ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి ఆలయంలో స్పై కెమెరా కళ్లజోడు కలకలం రేపింది. ఆలయ నిబంధనలను ఉల్లంఘించి కెమెరా అమర్చిన కళ్లద్దాలతో లోపలికి ప్రవేశించిన ఓ భక్తుడిని భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు.మహారాష్ట్రలోని పూణెకు చెందిన అంకేష్ అగర్వాల్ అనే భక్తుడు తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీకాళహస్తీశ్వర ఆలయ దర్శనానికి వచ్చారు. మొదట ఆయన ఆలయంలో రూ. 5,000 రుసుము చెల్లించి రాహు-కేతు నివారణ పూజ నిర్వహించారు. ఆ పూజ పూర్తయిన తర్వాత కుటుంబ సమేతంగా ప్రధాన ఆలయంలో స్వామి, అమ్మవార్ల దర్శనానికి వెళ్లారు. అమ్మవారి సన్నిధిలో దర్శనం చేసుకుంటుండగా, ఆయన కళ్లకు ఉన్న అద్దాలలో రహస్య కెమెరా (స్పై కెమెరా) అమర్చి ఉండటాన్ని అక్కడి అర్చకులు గుర్తించారు.విషయాన్ని గ్రహించిన అర్చకులు వెంటనే ఆలయ విధుల్లో ఉన్న స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) సిబ్బందికి సమాచారం అందించారు. స్పందించిన భద్రతా సిబ్బంది సదరు భక్తుడిని అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు.శ్రీకాళహస్తి ఆలయ ప్రాంగణంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావడం, ముఖ్యంగా గర్భాలయం పరిసరాల్లో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ చేయటంపై కఠిన నిషేధం అమల్లో ఉంది. అలాంటిది తనిఖీలను దాటుకుని స్పై కెమెరా కళ్లజోడుతో ఆలయంలోకి ఎలా రాగలిగారనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఆలయ అంతరాలయంలోని సున్నితమైన దృశ్యాలను ఏమైనా రికార్డ్ చేశారా అనే కోణంలో పోలీసులు, ఎస్పీఎఫ్ సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడ మేయర్ పీఠంపై ఉత్కంఠ..

వైసీపీ అభ్యర్థి ఖరారు.. కూటమిలో కసరత్తు!

నవంబర్ 14 (ప్రజావినికిడి):

రాష్ట్రంలో స్థానిక ఎన్నికల సందడి కొనసాగుతుండగా, అందరి దృష్టి ఇప్పుడు కాకినాడ కార్పొరేషన్‌పై కేంద్రీకృతమైంది. ఈ నెల 26న పోలింగ్ జరగనున్న ఈ ఎన్నికలు అధికార, ప్రతిపక్షాలకు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. ఓవైపు వైసీపీ వ్యూహాత్మకంగా తమ మేయర్ అభ్యర్థిని ప్రకటించి ప్రచారంలోకి దూకాలని చూస్తుండగా, మరోవైపు కూటమిలో భాగమైన జనసేన పార్టీలో అభ్యర్థి ఎంపికపై తీవ్ర కసరత్తు జరుగుతోంది. ఈ పరిణామాలు కాకినాడ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠను రేపుతున్నాయి.

కాకినాడ మేయర్ పీఠాన్ని ఎలాగైనా కైవసం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న వైసీపీ, ఆ దిశగా వేగంగా పావులు కదిపింది. నగరానికి చెందిన ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ కాద వెంకటరమణ తన కుటుంబంతో సహా మాజీ ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో పార్టీలో చేరారు.



ఇదే అదనుగా, ఆయన కుటుంబానికి చెందిన కాద సత్యశ్రీని కాకినాడ వైసీపీ మేయర్ అభ్యర్థిగా జగన్ ప్రకటించారు. నగరంలో మంచి పేరున్న వైద్యుల కుటుంబం కావడం, సామాజిక సమీకరణాల్లో భాగంగా బలమైన శెట్టి బలిజ వర్గానికి చెందిన వ్యక్తికి అవకాశం ఇవ్వడంతో వైసీపీ కొత్త రాజకీయ లెక్కలకు తెరతీసింది. దీంతో వార్డు అభ్యర్థులు కూడా నామినేషన్లకు సిద్ధమవుతున్నారు.

మరోవైపు, కూటమి పొత్తుల్లో భాగంగా కాకినాడ మేయర్ స్థానం జనసేన పార్టీకి దక్కింది. అయితే, పార్టీ నుంచి ఎవరు బరిలోకి దిగుతారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రస్తుతం జనసేన తరఫున గుత్తుల వెంకట శుభ, చొల్లంగి సుబ్బలక్ష్మి, కడలి ఈశ్వరి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అయితే, కాకినాడ మేయర్ పదవిని తీసుకోవాలా? లేక దానికి బదులుగా తూర్పు గోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి మారాలా? అనే దానిపై జనసేన పార్టీలో అంతర్గతంగా చర్చ జరుగుతున్నట్లు సమాచారం. కాకినాడను తమ కంచుకోటగా భావించే జనసేన, ఈ ఎన్నికల్లో గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తోంది. తొలి విడత మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ప్రభంజనం సృష్టించిన నేపథ్యంలో, కాకినాడ కార్పొరేషన్‌ను గెలవడం వైసీపీకి అత్యంత కీలకంగా మారింది. అదే సమయంలో తమ పట్టు నిలుపుకోవాలని కూటమి భావిస్తోంది. ఇటీవల కార్పొరేషన్‌లో విలీనమైన ఆరు కొత్త పంచాయతీల ఓటర్లు ఈ ఎన్నికల్లో నిర్ణయాత్మక పాత్ర పోషించనున్నారు. ఈ నేపథ్యంలో ఇరుపక్షాల వ్యూహ ప్రతివ్యూహాలతో కాకినాడ మేయర్ ఎన్నికల పోరు రసవత్తరంగా మారింది.

ప్రధాని మోదీ ఫోన్లు ట్యాప్ చేయరు

: కాంగ్రెస్ అగ్రనేత,శామ్ పిట్రోడా సంచలన వ్యాఖ్యలు

నవంబర్ 14(ప్రజావినికిడి):



గాంధీ కుటుంబానికి అత్యంత సన్నిహితుడు, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ మాజీ ఛైర్మన్ శామ్ పిట్రోడా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్ ట్యాపింగ్‌లకు పాల్పడతారని తాను భావించడం లేదని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై చేసిన ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలను పిట్రోడా బహిరంగంగా తోసిపుచ్చడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.ఎన్డీటీవీ కథనం ప్రకారం.. ఓ ఇంటర్వ్యూలో శామ్ పిట్రోడా ఈ అంశంపై మాట్లాడారు. “భారత ప్రధాని నా ఫోన్‌ను ట్యాప్ చేస్తారని నేను నమ్మడం లేదు. దేశంలో దృష్టి సారించాల్సిన పెద్ద సమస్యలు ఎన్నో ఉన్నాయి. ప్రధాని ఇలాంటి పనులు చేస్తారని నేను అనుకోను. నా ఫోన్ ట్యాప్ అవుతోందని నమ్మడానికి నాకైతే ఎలాంటి కారణం కనిపించడం లేదు. నిజాయితీగా చెప్పాలంటే నాకు ఎప్పుడూ అలా అనిపించలేదు“ అని ఆయన స్పష్టం చేశారు.కేంద్రం తన ఫోన్‌ను ట్యాప్ చేస్తోందని రాహుల్ గాంధీ నిన్న తీవ్ర ఆరోపణలు చేశారు. ముఖాముఖి చర్చకు వస్తే అసలైన నిజాలు బయటపడతాయని చెప్పారు. విదేశీ శక్తులకు ఎవరు లొంగిపోయారో ప్రజలకు తెలుస్తుందని అన్నారుఈ నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలపై పిట్రోడా మాట్లాడుతూ.. “మా ఇద్దరికీ ఒకరంటే ఒకరికి ఎంతో గౌరవం ఉంది. మేం మంచి స్నేహితులం, కలిసి పనిచేశాం. అయితే కొన్ని అంశాల్లో ఇద్దరి మధ్య భిన్నాభిప్రాయాలు ఉండటం సహజం“ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నేతే రాహుల్ వ్యాఖ్యలను బహిరంగంగా విభేదించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఏపీలో అదృశ్యమైన పిల్లల కోసం ప్రత్యేక కమిటీలు..

ప్రభుత్వం కీలక జీవో -రాష్ట్ర స్థాయి కమిటీ

అమరావతి,నవంబర్ 14 (ప్రజావినికిడి): రాష్ట్రంలో అదృశ్యమైన పిల్లలు, మానవ అక్రమ రవాణా నిరోధక చర్యల పర్యవేక్షణకు రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. రాష్ట్ర స్థాయి కమిటీకి మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి / కార్యదర్శి ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. డీజీపీ లేదా అదనపు డీజీపీ (సీఐడీ / మిస్సింగ్ చిల్డ్రన్) కో-ఛైర్‌పర్సన్‌గా ఉంటారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ / డైరెక్టర్ మెంబర్ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తారు. రాష్ట్ర నోడల్ అధికారి, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఐజీ/ఎస్పీ స్థాయి అధికారి ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. కార్మిక, పాఠశాల విద్య, వైద్య ఆరోగ్య, సాంఘిక, గిరిజన, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ప్రతినిధులు కమిటీలో సభ్యులుగా వ్యవహరించనున్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, రైల్వే పోలీస్ సైబర్ క్రైమ్/జజుమీ విభాగాల ప్రతినిధులతో పాటు ఇద్దరు స్వచ్ఛంద సంస్థలప్రతినిధులకు చోటు కల్పించారు.

జిల్లా స్థాయి కమిటీలుఏపీలోని అన్ని జిల్లాల్లో కలెక్టర్లు/జిల్లా మేజిస్ట్రేట్ల ఛైర్‌పర్సన్‌గా జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. జిల్లా కమిటీకి ఎస్పీ ప్రతినిధి కో-ఛైర్‌పర్సన్‌గా, జిల్లా బాలల రక్షణ అధికారి మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. జిల్లా కమిటీలో , బాలల సంక్షేమ కమిటీ రైల్వే పోలీస్, కార్మిక, విద్య, ఆరోగ్య శాఖలు, శిశు సంరక్షణ సంస్థలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు.

కమిటీల ప్రధాన విధులు ఇవే..రాష్ట్రవ్యాప్తంగా అదృశ్యమైన పిల్లలు, అక్రమ రవాణా కేసుల స్థితిగతులను, ఎఫ్ఐఆర్ ల నమోదు, దర్యాప్తు పురోగతిని రాష్ట్ర కమిటీ సమీక్షిస్తుంది. మానవ అక్రమ రవాణాకు అవకాశమున్న సున్నితమైన జిల్లాలు, ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టడంతో పాటు, గ్రామాలు, రవాణా మార్గాలపై జిల్లా కమిటీలు నిఘా పెట్టనున్నాయి. రక్షించిన పిల్లలను తిరిగి కుటుంబాలకు అప్పగించే ముందు పూర్తి స్థాయి విచారణ జరపడంతో పాటు, కుటుంబ సభ్యుల ప్రమేయమున్న కేసులను ప్రత్యేకంగా సమీక్ష జరపనున్నారు. రక్షించిన పిల్లల ఆధార్ బయోమెట్రిక్ ధృవీకరణ, గుర్తింపు పత్రాల ప్రక్రియను ఈ కమిటీ పర్యవేక్షణ చేయనుంది. డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థలు, సీసీటీఎన్ఎస్ అనుసంధానం, అంతర్రాష్ట్ర సమన్వయ వ్యవస్థలను రాష్ట్ర కమిటీ పర్యవేక్షిస్తుంది. రక్షించిన పిల్లలకు పునరావాసం, కౌన్సెలింగ్ కల్పించడంతో పాటు, వారిని తప్పనిసరిగా బాలల సంక్షేమ కమిటీ ఎదుట హాజరు పరచాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే జిల్లా, గ్రామ స్థాయిల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, జిల్లా కమిటీలు ప్రతినెలా రాష్ట్ర స్థాయి కమిటీకి నివేదికలు సమర్పించాల్సి ఉంటుందని సర్కార్ స్పష్టం చేసింది

హైదరాబాద్ క్రికెట్ ప్రక్షాళనే లక్ష్యం..

రంగంలోకి అంబటి రాయుడు!

సెలక్షన్లలో పారదర్శకత కోసం సరికొత్త విధానం

జింఖానా పిచ్‌ల కోసం సొంతంగా ట్రాక్టర్ తెప్పించిన వైనం

ఆరు నెలల్లోనే ఫలితాలు.. రంజీల్లో హైదరాబాద్‌కు అగ్రస్థానం

హెచ్‌సీఏను టాప్-5లో నిలపాలన్నదే తన లక్ష్యమన్న రాయుడు





నవంబర్ 14 (ప్రజావినికిడి):

భారత మాజీ క్రికెటర్ అంబటి రాయుడు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ ఆపరేషన్స్‌గా బాధ్యతలు స్వీకరించి ఆరు నెలలు పూర్తయ్యాయి. ఈ స్వల్ప కాలంలోనే తక్షణ ఫలితాల కంటే వ్యవస్థాగత ప్రక్షాళన, మౌలిక సదుపాయాల కల్పనపైనే ప్రధానంగా అంబటి దృష్టి సారించాడు. అతడి కృషితో రంజీ ట్రోఫీ ప్రస్తుత సీజన్ తొలి దశలో హైదరాబాద్ జట్టు మూడు విజయాలు, ఒక డ్రాతో ఎలైట్ గ్రూప్-బిలో 20 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది.అయితే, ఈ ప్రాథమిక ఫలితాలను చూసి సంతృప్తి చెందడానికి రాయుడు సిద్ధంగా లేడు. తాము నిర్మిస్తున్న పటిష్టమైన వ్యవస్థలు, ఆటగాళ్లలో పెరుగుతున్న ఆత్మవిశ్వాసమే తనకు అసలైన సంతృప్తినిస్తున్నాయని అంబటి పేర్కొన్నాడు. జూనియర్ క్రికెటర్లకు అత్యధిక మ్యాచ్‌లు ఆడే అవకాశం కల్పించడం (ఈ సీజన్‌లో దాదాపు వెయ్యి మ్యాచ్ రోజులు), దిగ్గజ ఆటగాడు వసీం జాఫర్‌ను మెంటార్‌గా నియమించడం, జిల్లా స్థాయి ఆటగాళ్లకు సైతం ప్రాతినిధ్యం లభించేలా ఓపెన్ ట్రయల్స్ నిర్వహించడం వంటి కీలక సంస్కరణలు చేపట్టాడు. ముఖ్యంగా సెలక్షన్ ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట వేశాడు. ప్రతి ఎంపికకు గల కారణాలను లిఖితపూర్వకంగా నమోదు చేసి, జస్టిస్ పి. నవీన్ రావు నేతృత్వంలోని కమిటీకి సమర్పిస్తున్నారు. ఈ వినూత్న విధానాన్ని ఆయన ‘డీఆర్ఎస్‘ (డెసిషన్ రివ్యూ సిస్టమ్)గా అభివర్ణించారు.

సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో పిచ్‌ల నాణ్యతను మెరుగుపరచడంలో రాయుడు ప్రదర్శించిన చొరవ ఆయన అంకితభావానికి నిదర్శనం. నిధుల కొరత, పాలనాపరమైన అడ్డంకులను అధిగమిస్తూ, అవసరమైన పరికరాలు, సిబ్బంది లేకపోయినా స్వయంగా ట్రాక్టర్లు, కూలీలను ఏర్పాటు చేసుకుని పనులు పూర్తి చేయించాడు. వికారాబాద్ నుంచి ప్రత్యేకంగా మట్టిని తెప్పించి నాణ్యమైన పిచ్‌లను సిద్ధం చేయించాడు. ఈ క్రమంలో కొన్ని వ్యతిరేకతలు ఎదురైనప్పటికీ, హెచ్‌సీఏ కార్యదర్శి జీవన్ రెడ్డి, ఎస్ఎంసీ మద్దతుతో దృఢ నిశ్చయంతో ముందుకు సాగుతున్నాడు. “హెచ్‌సీఏ చరిత్రలో తొలిసారిగా చెడుపై మంచి విజయం సాధిస్తోంది“ అని రాయుడు ఈ సందర్భంగా వ్యాఖ్యానించాడు.భవిష్యత్తులో మహబూబ్‌నగర్, కరీంనగర్‌లలో క్రికెట్ అకాడమీలు, ఉప్పల్‌లో హై-పెర్ఫార్మెన్స్ సెంటర్ ఏర్పాటు చేయాలనే ప్రణాళికలు సిద్ధం చేశాడు. అటు పరిపాలనలో, ఇటు క్రీడలో హెచ్‌సీఏను దేశంలోని అగ్రగామి ఐదు అసోసియేషన్లలో ఒకటిగా నిలబెట్టడమే తన లక్ష్యమని రాయుడు స్పష్టం చేశాడు. దశాబ్ద కాలంగా రంజీ నాకౌట్ దశకు కూడా చేరుకోలేకపోయిన హైదరాబాద్ జట్టుకు ఈ శుభారంభం ఊరటనిచ్చే అంశమే అయినప్పటికీ, ఇది సుదీర్ఘ ప్రయాణంలో తొలి అడుగు మాత్రమేనని ఆయన పేర్కొన్నాడు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

ప్రత్యామ్నాయం లేని రాజకీయ శూన్యంలో భారత్!

● 80 ఏళ్ల స్వాతంత్ర్య ప్రస్థానంలో పాలకుల వైఫల్యాలు..
ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి



భారతదేశం స్వాతంత్ర్యం సాధించి ఎనిమిది దశాబ్దాలు పూర్తిచేసుకుంటున్న తరుణంలో దేశ రాజకీయ వ్యవస్థ ఎటువైపు పయనిస్తోందనే ప్రశ్న అత్యంత కీలకంగా మారింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకు విశ్వాసం కలిగించే రాజకీయ నాయకత్వం, స్పష్టమైన విధానాలు, సమర్థవంతమైన పాలన ఎంతో అవసరం. కానీ స్వాతంత్ర్యానంతరం దేశాన్ని పాలించిన వివిధ రాజకీయ పార్టీలు ప్రజల ఆకాంక్షలను పూర్తిస్థాయిలో నెరవేర్చలేకపోయాయనే విమర్శలు ఉన్నాయి. ఒక పార్టీపై అసంతృప్తి కలిగినప్పుడు మరో పార్టీకి అవకాశం ఇచ్చినా, ఆశించిన మార్పు కనిపించకపోవడంతో ప్రజలు రాజకీయ వ్యవస్థపైనే నిరాశకు గురవుతున్నారు. ఈ పరిస్థితి భారతదేశాన్ని ఒక క్లిష్టమైన రాజకీయ సందిగ్ధంలోకి నెట్టింది.స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించిన కాంగ్రెస్ పార్టీ దేశంలో సుదీర్ఘకాలం అధికారంలో కొనసాగింది. స్వాతంత్ర్యానంతరం దేశ నిర్మాణం, పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయ రంగం, విద్య, వైద్యం వంటి కీలక రంగాల్లో అనేక విధానాలను రూపొందించింది. రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థ, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి పునాదులు వేసింది. అయితే కాలక్రమంలో పాలనలో లోపాలు, అవినీతి, కుటుంబ రాజకీయాలు, నాయకత్వ సమస్యలు, ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యం వంటి పరిణామాలు ఆ పార్టీ బలహీనతకు కారణమయ్యాయి. ప్రజల్లో ఏర్పడిన అసంతృప్తిని గుర్తించి సరిదిద్దుకోవడంలో కాంగ్రెస్ విఫలమవడంతో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తులకు అవకాశం ఏర్పడింది.కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా కమ్యూనిస్టులు, సోషలిస్టులు ప్రజల ముందుకు వచ్చారు. సమానత్వం, సామాజిక న్యాయం, పేదల సంక్షేమం, కార్మికుల హక్కులు, రైతుల అభివృద్ధి వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావించారు. కొన్ని రాష్ట్రాల్లో అధికారాన్ని కూడా చేపట్టారు. అయితే జాతీయ స్థాయిలో బలమైన ప్రత్యామ్నాయంగా ఎదగలేకపోయారు. అంతర్గత విభేదాలు, సిద్ధాంతపరమైన భిన్నాభిప్రాయాలు, నాయకత్వ సమస్యలు, రాజకీయ చీలికలు వారి బలాన్ని తగ్గించాయి. ప్రజల ఆశలకు అనుగుణంగా దేశవ్యాప్తంగా విస్తృతమైన రాజకీయ ప్రభావాన్ని చూపడంలో ఈ పార్టీలు విఫలమయ్యాయి.కాంగ్రెస్ బలహీనపడిన సమయంలో జనతా పార్టీ, నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్ వంటి కూటములు ప్రత్యామ్నాయాలుగా ముందుకొచ్చాయి. కాంగ్రెస్ అనుసరించిన విధానాల్లోని లోపాలను సరిదిద్ది, ప్రజలకు మెరుగైన పాలన అందిస్తామని హామీ ఇచ్చాయి. అయితే భిన్న సిద్ధాంతాలు, వేర్వేరు రాజకీయ ప్రయోజనాలు కలిగిన పార్టీలు ఒకే వేదికపై ఎక్కువకాలం కొనసాగలేకపోయాయి. అధికార పంపిణీ, నాయకత్వ పోటీలు, పరస్పర విభేదాలు కూటముల పతనానికి దారితీశాయి. దీంతో దేశానికి స్థిరమైన ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థను అందించడంలో అవి విఫలమయ్యాయి.ఈ రాజకీయ శూన్యంలో భారతీయ జనతా పార్టీ బలమైన ప్రత్యామ్నాయంగా ఎదిగింది. అభివృద్ధి, జాతీయవాదం, సాంస్కృతికవాదం అనే అంశాలను ముందుకు తీసుకొచ్చింది. దేశానికి కొత్త దిశను చూపగలమని ప్రజల్లో ఆశలు కల్పించింది. ముఖ్యంగా అవినీతి రహిత పాలన, ఆర్థిక ప్రగతి, ఉద్యోగ అవకాశాలు, మౌలిక సదుపాయాల విస్తరణ వంటి హామీలు ప్రజలను ఆకర్షించాయి. అయితే కాలక్రమంలో ఈ హామీల అమలుపై ప్రశ్నలు తలెత్తాయి. అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా చేరుతున్నాయా? నిరుద్యోగ సమస్య పరిష్కారమవుతోందా? రైతుల ఆదాయం పెరుగుతోందా? సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయా? అనే ప్రశ్నలు ప్రజల్లో చర్చనీయాంశాలయ్యాయి.జాతీయవాదం, సాంస్కృతికవాదం పేరుతో ముందుకు తీసుకెళ్తున్న రాజకీయ విధానాలపై కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రశ్నించే గొంతుకలపై ప్రతీకారమా?

పత్రికా స్వేచ్ఛకు పెరుగుతున్న ముప్పు..
ప్రజాస్వామ్య విలువలపై ఆందోళన

ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం పౌరుల హక్కు. ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం పాలకుల బాధ్యత. ప్రభుత్వ విధానాలను విమర్శించడం, అధికారంలో ఉన్నవారిని నిలదీయడం, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం జర్నలిస్టుల ప్రాథమిక విధులు. అయితే నేడు దేశంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకలపై ఆంక్షలు పెరుగుతున్నాయనే విమర్శలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా నార్వేకు చెందిన జర్నలిస్టు హెల్లే లీంగ్ స్పెన్‌సెన్‌కు భారత వీసా రద్దు చేయడం ఈ చర్చకు మరోసారి తెరలేపింది. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో తెలంగాణ ప్రభుత్వం కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్‌కు 70 దేశాల నుంచి దాదాపు వెయ్యి మంది ప్రతినిధులను ఆహ్వానించారు. అయితే వారిలో 315 మంది విదేశీ ప్రతినిధులకు వీసాలు నిరాకరించడం వివాదానికి దారితీసింది. వీసా నిరాకరణకు గురైన వారిలో నార్వే జర్నలిస్టు హెల్లే లీంగ్ స్పెన్‌సెన్ కూడా ఉన్నారు. సమ్మిట్‌లో 'మీడియా భవిష్యత్తు పత్రికా స్వేచ్ఛ' అనే అంశంపై ఆమె ప్రసంగించాల్సి ఉంది. భారత్‌కు బయలుదేరడానికి సిద్ధమైన చివరి నిమిషంలో కేంద్ర హోంశాఖ ఆమె వీసాను రద్దు చేసింది. దీనికి సంబంధించిన కారణాలను అధికారికంగా వెల్లడించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.గతంలో నార్వే రాజధాని ఓస్లోలో జరిగిన ఓ మీడియా కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నప్పుడు హెల్లే ఆయనను నేరుగా ప్రశ్నించారు. మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు ఎందుకు సమాధానాలు ఇవ్వడం లేదని నిలదీశారు. అయితే ప్రధాని సమాధానం చెప్పకుండా అక్కడి నుంచి వెళ్లిపోయారని ఆమె పేర్కొన్నారు. ఈ సంఘటన తర్వాత ఆమెపై వివిధ రకాల విమర్శలు, ఆరోపణలు వచ్చాయి. అయినప్పటికీ వెనక్కి తగ్గకుండా మోదీ ప్రభుత్వ విధానాలపై విమర్శనాత్మక కథనాలు రాశారు. పారిశ్రామికవేత్తలు అదానీ, అంబానీల వ్యవహారాలపైనా ప్రశ్నలు సంధించారు. ఈ పరిణామాలే తన వీసా రద్దుకు కారణమై ఉండవచ్చని ఆమె అనుమానం వ్యక్తం చేస్తున్నారు.ఒక జర్నలిస్టు వీసా రద్దు కావడం సాధారణ పరిపాలనా నిర్ణయంగా కొట్టిపారేయలేని పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా పత్రికా స్వేచ్ఛపై జరిగే అంతర్జాతీయ చర్చలో పాల్గొనాల్సిన జర్నలిస్టుకు అనుమతి నిరాకరించడం ప్రజాస్వామ్య విలువలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఒకవైపు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ తన గొప్పతనాన్ని చాటుకుంటోంది. మరోవైపు ప్రభుత్వాన్ని ప్రశ్నించే జర్నలిస్టులపై ఆంక్షలు, కేసులు, వేధింపులు ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ రెండింటి మధ్య ఉన్న వైరుధ్యాన్ని పాలకులు గుర్తించాల్సిన అవసరం ఉంది.2019లో కశ్మీర్‌లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం వల్ల ప్రజలకు సమాచారాన్ని చేరవేసే అవకాశాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 2023లో గుజరాత్ అల్లర్లపై బీబీసీ



రూపొందించిన డాక్యుమెంటరీపై ఆంక్షలు విధించడం, ఆ సంస్థ కార్యాలయాలపై ఆదాయపు పన్ను శాఖ తనిఖీలు జరగడం చర్చనీయాంశమయ్యాయి. అదే ఏడాది న్యూస్‌క్లిక్ సంస్థపై ఢిల్లీ పోలీసుల చర్యలు, సంస్థ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ అరెస్టు కూడా మీడియా స్వేచ్ఛపై ఆందోళనలకు కారణమయ్యాయి. విదేశీ నిధులు, చైనా అనుకూల ప్రచారం వంటి ఆరోపణలతో ఈ చర్యలు చేపట్టినప్పటికీ, వాటి వెనుక ఉన్న ఉద్దేశాలపై విస్తృత చర్చ జరిగింది. జర్నలిస్టులు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలపై కఠిన చట్టాల కింద కేసులు నమోదవుతున్నాయనే విమర్శలు కూడా ఉన్నాయి.ప్రభుత్వాన్ని ప్రశ్నించడం దేశద్రోహం కాదు. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించడం దేశానికి వ్యతిరేకంగా వ్యవహరించడం అంతకంటే కాదు. ప్రజాస్వామ్యంలో అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా మాట్లాడే హక్కు ఎంత ముఖ్యమో, వ్యతిరేకంగా మాట్లాడే హక్కు కూడా అంతే ముఖ్యం. ప్రభుత్వ నిర్ణయాల్లో లోపాలు ఉంటే వాటిని ఎత్తిచూపడం మీడియా బాధ్యత. ప్రజాధనం ఎలా ఖర్చవుతోంది? సంక్షేమ పథకాలు ఎవరికి చేరుతున్నాయి? అవినీతి ఎక్కడ జరుగుతోంది? ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు ఎందుకు విఫలమవుతున్నాయి? వంటి ప్రశ్నలకు సమాధానాలు రాబట్టాల్సిన బాధ్యత పత్రికలపై ఉంది.గతంలో ప్రజలకు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి వార్తాపత్రికలు, టెలివిజన్ మాత్రమే ప్రధాన వేదికలుగా ఉండేవి. ఇప్పుడు యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాలు సామాన్యులకు కూడా తమ అభిప్రాయాలను వెల్లడించే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. ప్రభుత్వ నిర్ణయాలపై ప్రజలు నేరుగా స్పందిస్తున్నారు.

అవినీతి, అక్రమాలు, ప్రజా సమస్యలకు సంబంధించిన అంశాలను వెలుగులోకి తీసుకొస్తున్నారు. అయితే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న పోస్టులను తొలగించడం, సామాజిక మాధ్యమ ఖాతాలను నిలిపివేయడం, విమర్శలు చేసే వారిపై అన్‌లైన్ వేధింపులు జరగడం వంటి పరిణామాలు స్వేచ్ఛాయుత వాతావరణానికి విఘాతం కలిగిస్తున్నాయి.భారతదేశం అనేక మతాలు, భాషలు, సంస్కృతుల సమ్మేళనం. ఇలాంటి వైవిధ్యభరితమైన దేశంలో ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే అవకాశం ఉండాలి. మతం, కులం, ప్రాంతం, రాజకీయ అభిప్రాయాల ఆధారంగా ప్రజలను విభజించే ప్రయత్నాలను ప్రశ్నించడం కూడా మీడియా బాధ్యతే. అయితే మతపరమైన అంశాలపై విమర్శలు చేసినా, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించినా వెంటనే దేశ వ్యతిరేకులనే ముద్ర వేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. విమర్శలకు విమర్శలతో కాకుండా వాస్తవాలతో సమాధానం చెప్పాలి.అదే సమయంలో ప్రభుత్వ బాధ్యతలను కూడా విస్మరించలేం. తప్పుడు వార్తలను అరికట్టడం, మతపరమైన ఘర్షణలు జరగకుండా చూడటం, ఉగ్రవాద కార్యకలాపాలను నియంత్రించడం, దేశ భద్రతను కాపాడటం ప్రభుత్వ కర్తవ్యాలు. సామాజిక మాధ్యమాల దుర్వినియోగాన్ని అడ్డుకోవడం కూడా అవసరమే. అయితే ఈ చర్యలన్నీ రాజ్యాంగ పరిధిలో, పారదర్శకంగా ఉండాలి. జాతీయ భద్రత పేరుతో పత్రికా స్వేచ్ఛను, పౌరుల భావ ప్రకటనా హక్కును హరించే పరిస్థితి ఏర్పడకూడదు.ఇటీవల తీసుకొచ్చిన డిజిటల్ వ్యక్తిగత సమాచార పరిరక్షణ చట్టంపైనా మీడియా వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అవినీతి, అక్రమాలను వెలికితీసే పరిశోధనాత్మక జర్నలిజానికి వ్యక్తిగత సమాచార సేకరణ ఎంతో అవసరం. సమాచార హక్కు, ప్రజా ప్రయోజనం, వ్యక్తిగత గోప్యత మధ్య సమతుల్యత పాటించాలి. అయితే చట్టంలోని నిబంధనలు పరిశోధనాత్మక జర్నలిజానికి అడ్డంకిగా మారితే ప్రజలకు వాస్తవాలు తెలిసే అవకాశాలు తగ్గిపోతాయి. ప్రభుత్వ వ్యవహారాల్లో పారదర్శకతను పెంచాల్సిన సమయంలో సమాచార సేకరణపై ఆంక్షలు విధించడం సరైన విధానం కాదు.ప్రజాస్వామ్యానికి శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థ ఎంత ముఖ్యమో స్వతంత్ర మీడియా కూడా అంతే ముఖ్యం. మీడియాను ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా పేర్కొనడానికి కారణం ఇదే. ఈ స్తంభం బలహీనపడితే పాలకుల తప్పులను ప్రశ్నించే వ్యవస్థ బలహీనపడుతుంది. ప్రజలకు వాస్తవాలు తెలియకుండా పోతాయి. అధికార కేంద్రీకరణ పెరిగి ప్రజాస్వామ్య వ్యవస్థలో జవాబుదారీతనం తగ్గిపోయే ప్రమాదం ఉంది.హెల్లే లీంగ్ స్పెన్‌సెన్ వీసా రద్దు వివాదం ఒక వ్యక్తికి సంబంధించిన అంశంగానే మిగిలిపోకూడదు. విదేశీ జర్నలిస్టులకు, దేశీయ మీడియా సంస్థలకు, స్వతంత్రంగా పనిచేసే విలేకరులకు ఎలాంటి భరోసా ఉందనే ప్రశ్నకు సమాధానం రావాలి. వీసా రద్దుకు సరైన కారణాలు ఉంటే ప్రభుత్వం వాటిని పారదర్శకంగా వెల్లడించాలి. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించడం సహజమైన ప్రక్రియగా చూడాలి తప్ప ప్రతీకార చర్యలకు కారణంగా భావించకూడదు.అధికారంలో ఉన్నవారు విమర్శలను సహించగలిగినప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం వల్ల సమస్యలు పరిష్కారం కావు. వాటిని మరింత జటిలం చేస్తాయి. ప్రభుత్వాలు విమర్శలను స్వీకరించి, తప్పులను సరిదిద్దుకుని, ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలి. జర్నలిస్టులు కూడా వాస్తవాలు, ఆధారాల ఆధారంగా బాధ్యతాయుతమైన వార్తలు అందించాలి. పత్రికా స్వేచ్ఛ అనేది జర్నలిస్టులకే పరిమితమైన హక్కు కాదు.. అది ప్రజలందరి హక్కు. ఆ హక్కును కాపాడటం ప్రతి ప్రజాస్వామ్య ప్రభుత్వ బాధ్యత.

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

మీ పెట్టుబడులకు రక్షణ, లాభం
ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంది
2034 నాటికి లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ
ఆరోగ్య రంగంలో పీహెచ్ఎఫ్ఐ కీలక పాత్ర పోషిస్తుంది: సీఎం రేవంత్



తెలంగాణలోని మారుమూల గ్రామంలో ఉన్న విద్యార్థి కూడా అమెరికాలో పనిచేసే వారితో పోటీపడే స్థాయికి ఎదగాలి" అని ఆయన ఆకాంక్షించారు.

రాష్ట్రంలో గతంలో చంద్రబాబు, వైఎస్ఆర్, కేసీఆర్ ప్రభుత్వాలు తీసుకొచ్చిన మంచి విధానాలను తమ ప్రభుత్వం కొనసాగిస్తోందన్నారు. పెట్టుబడిదారులు, విద్యాసంస్థల విషయం లో తమకు ఎలాంటి వివక్ష లేదని చెప్పారు. తెలంగాణను 2047 నాటికి అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ రైజింగ్-2047 విజన్‌ను రూపొందించామని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు అవతల రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని.. 160 కిలోమీటర్ల రహదారికి కేంద్రం టెండర్లు పిలిచిందని, దక్షిణభాగాన్ని రాష్ట్రప్రభుత్వ పరిధిలోనే చేపట్టబోతున్నామని వెల్లడించారు. ఆర్ఆర్ఆర్ చుట్టూ సుమారు 10వేల చదరపుకిలోమీటర్ల పరిధిలో తయారీ రంగాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. దేశ జీడీపీలో రాష్ట్రం వాటా 10శాతానికి చేర్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని చెప్పారు.

రీజినల్ రింగు రోడ్డు ప్రాజెక్టులో దక్షిణభాగాన్ని రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించనుంది. సీఎం రేవంత్ పీహెచ్ఎఫ్ఐ క్యాంపస్ శంకుస్థాపన సందర్భంగా చేసిన వ్యాఖ్యలతో ఈ అంశంపై స్పష్టత వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే దక్షిణ భాగం ప్రాజెక్టును రోడ్లు-భవనాల శాఖ పరిధి నుంచి తప్పిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖకు అనుబంధంగా ఉండే హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్)కు అప్పగించింది. ఆర్ఆర్ఆర్ దక్షిణభాగానికి సంబంధించిన అన్ని పనులను హెచ్‌జీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ పర్యవేక్షిస్తారని పేర్కొంది.కానీ నిర్మాణ బాధ్యతలపై ఆ ఉత్తర్వుల్లో స్పష్టత ఇవ్వకపోవడం తో.. డీపీఆర్ సహా అన్ని వ్యవహారాలను పూర్తిచేసి కేంద్రానికి నివేదిక సమర్పిస్తారన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

కానీ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే నిర్మించనున్నామని సీఎం రేవంత్ తాజాగా తేల్చిచెప్పడంతో స్పష్టత వచ్చింది. నిజానికి 2023 డిసెంబరులో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకాగానే రీజనల్ రోడ్డుపై ఫోకస్ చేసింది. ఉత్తరభాగంలో భూసేకరణ ఒక కొలిక్కి రావడంతో.. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు ఉన్న దక్షిణభాగంపై దృష్టిపెట్టింది. తొలుత దీనిని కేంద్రమే నిర్మించాలని కోరింది. కానీ 2024 జూలైలో ఈ రోడ్డు అలైన్‌మెంట్, నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వమే చర్యలు చేపట్టింది. కానీ నిధులు, ఇతర అంశాలను దృష్టిలో పెట్టుకుని దక్షిణభాగం పనులను చేపట్టడంటూ 2024 డిసెంబరులో కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. భూసేకరణ వ్యయంలో 50 శాతం భరిస్తామని తెలిపింది. ఈ క్రమంలో దక్షిణభాగం నిర్మాణానికి కేంద్రం సుముఖత వ్యక్తం చేసింది. కానీ ఆ తర్వాత అడుగు ముందుకు పడలేదు. ఈ క్రమంలో మళ్లీ రాష్ట్ర ప్రభుత్వమే దక్షిణభాగంపై కార్యాచరణ మొదలుపెట్టింది.

ఇకపై ఆ ప్రాసీజర్ మెట్ల బావులకు కూడా వర్తింపజేస్తాం : హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్



హైదరాబాద్,నవంబర్ 14:(ప్రజావినికిడి):

తెలంగాణలో చెరువుల పునరుద్ధరణకు అమలు చేస్తున్న స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్‌వోపీ)లను ఇకపై చారిత్రక మెట్ల బావుల పరిరక్షణకు కూడా వర్తింపజేయనున్నట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మెట్ల బావుల పరిరక్షణ, అవగాహన కార్యక్రమంలో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని భవిష్యత్తులో జాతీయ స్థాయి విధానంగా ముందుకు తీసుకెళ్లే అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.హైదరాబాద్ నగరంలో నీటి ఎద్దడి, వరద నియంత్రణ, కరవు నివారణ అంశాలపై వచ్చే మంగళవారం కేంద్ర హోంశాఖ కార్యదర్శితో సమావేశం కానున్నట్లు రంగనాథ్ తెలిపారు. ఈ భేటీలో చెరువుల సంరక్షణతో పాటు ప్రాచీన మెట్ల బావుల పునరుద్ధరణను కూడా ప్రధాన ఎజెండాగా చేర్చనున్నట్లు చెప్పారు.చెరువులతో పోలిస్తే మెట్ల బావులు వికేంద్రీకృత జల వనరులుగా సమాజానికి ఎంతో మేలు చేస్తాయని ఆయన వివరించారు. గతంలో ఆలయాలు, చెరువుల పరిసరాల్లో ఉన్న అనేక మెట్ల బావులు కాలక్రమేణా కనుమరుగయ్యాయని, వాటిని తిరిగి వెలుగులోకి తెచ్చి పునరుద్ధరిస్తే భూగర్భ జల మట్టాలు గణనీయంగా పెరుగుతాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో నెలకొన్న నీటి కొరత నేపథ్యంలో ఈ చర్యలు ఎంతో ఆవశ్యకమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పటికే హైదరాబాద్ పరిధిలో దాదాపు అంతరించిపోయిన పలు చెరువులను హైడ్రా విజయవంతంగా పునరుద్ధరించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.అధికారిక లెక్కల ప్రకారం తెలంగాణవ్యాప్తంగా 600కు పైగా, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 160కి పైగా మెట్ల బావులు ఉన్నట్లు గుర్తించారు. క్షేత్రస్థాయిలో వీటి సంఖ్య మరింత ఎక్కువగా ఉండే అవకాశముంది. కాగా, ఈ సదస్సు సందర్భంగా ఆకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ సంప్రదాయ మెట్ల బావుల వారసత్వం, పూర్వకాలపు నీటి సంరక్షణ పద్ధతులపై ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ.. ప్రస్తుత నీటి సంక్షోభం కారణంగా పురాతన నీటి పరిరక్షణ పద్ధతులపై ప్రాధాన్యత పెరిగిందన్నారు. సంప్రదాయ జల వనరుల సంరక్షణకు సంబంధించిన కీలక అంశాలను క్యూర్ చట్టంలో చేర్చినట్లు ఆయన వెల్లడించారు. ప్రాచీన జల వనరులకు జీవం పోయడం ద్వారా నగరంలో నీటి భద్రతను పటిష్ఠం చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు.

హార్దిక్‌తో జట్టుకు మరింత సమతూకం



అర్ష్‌దీప్‌ను వదులుకోవడం కష్టమైన నిర్ణయం..
పంజాబ్ కింగ్స్ సహ యజమాని మోహిత్ బర్మన్

న్యూఢిల్లీ, నవంబర్ 14: ఐపీఎల్-2027 సీజన్‌కు ముందు ముంబై ఇండియన్స్, పంజాబ్ కింగ్స్ మధ్య జరిగిన కీలక ఆటగాళ్ల మార్పిడిపై పంజాబ్ కింగ్స్ సహ యజమాని మోహిత్ బర్మన్ స్పందించారు. హార్దిక్ పాండ్యాను జట్టులోకి తీసుకోవడం వల్ల మరింత సమతూకం ఏర్పడిందని తెలిపారు. బ్యాటింగ్, బౌలింగ్‌తో పాటు నాయకత్వ లక్షణాలు కలిగిన హార్దిక్ జట్టుకు ఎంతో ఉపయోగపడతాడని పేర్కొన్నారు.హార్దిక్ ప్రపంచంలోని అత్యుత్తమ ఆల్‌రౌండర్లలో ఒకరని, ఒత్తిడిలోనూ మ్యాచ్ ఫలితాన్ని మార్చగల సామర్థ్యం ఉందని బర్మన్ అన్నారు. 2025లో ఫైనల్‌కు చేరిన పంజాబ్ కింగ్స్ ఈసారి టైటిల్ సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు.కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో హార్దిక్ ఆడటంపై ఎలాంటి సమస్య లేదన్నారు. ఇద్దరు అనుభవజ్ఞులైన క్రికెటర్లు జట్టులో ఉండటం అదనపు బలమని అభిప్రాయపడ్డారు.మరోవైపు అర్ష్‌దీప్ సింగ్‌ను వదులుకోవడం చాలా కష్టమైన నిర్ణయమని బర్మన్ వెల్లడించారు. గత ఎనిమిది సీజన్లుగా పంజాబ్‌కు సేవలందించిన అర్ష్‌దీప్ అభిమానులకు ఎంతో ఇష్టమైన ఆటగాడని, అయితే జట్టు విజయాల కోసం కొన్ని కఠిన నిర్ణయాలు తప్పవని వివరించారు.హార్దిక్ పాండ్యా రూ. 18 కోట్ల ఒప్పందంతో పంజాబ్ కింగ్స్‌కు మారగా, అర్ష్‌దీప్ సింగ్ అదే మొత్తంతో ముంబై ఇండియన్స్‌కు చేరాడు.

ఆఖరి బంతి వరకు ఉత్కంఠ..

భారత్‌దే పైచేయి!



పాకిస్థాన్‌పై ఒక్క వికెట్ తేడాతో సంచలన విజయం.. అండర్-19 ఆసియా కప్ టైటిల్ కైవసం

దుబాయ్, నవంబర్ 14: అండర్-19 ఆసియా కప్ ఫైనల్‌లో యువ భారత్ అద్భుత పోరాట పటిమను ప్రదర్శించింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో ఒక్క వికెట్ తేడాతో విజయం సాధించి ఆసియా ఛాంపియన్‌గా నిలిచింది. భారీ లక్ష్య ఛేదనలో ఒక దశలో ఓటమి అంచున నిలిచిన భారత జట్టును చివరి వికెట్‌కు ముందు వచ్చిన బ్యాటర్ల పోరాటం విజయతీరాలకు చేర్చింది. చివరి ఓవర్లలో నరాలు తెగే ఉత్కంఠ మధ్య సాగిన ఈ మ్యాచ్ క్రికెట్ అభిమానులకు అసలైన మజాను అందించింది.తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 336 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఆ జట్టు బ్యాటర్లు భారత బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఉస్మాన్ ఖాన్ అద్భుత సెంచరీతో జట్టుకు భారీ స్కోరు అందించగా, అబ్దుల్ 80 పరుగులు, యూసఫ్ 63 పరుగులతో రాణించారు. వీరి భాగస్వామ్యాలతో పాకిస్థాన్ భారీ లక్ష్యాన్ని భారత్ ముందుంచింది. భారత బౌలర్లు ఆరంభంలో వికెట్లు తీసినా, పాకిస్థాన్ బ్యాటర్ల దూకుడును పూర్తిగా అడ్డుకోలేకపోయారు. భారత బౌలర్లలో కావ్య పటేల్ నాలుగు వికెట్లు పడగొట్టి ఆకట్టుకోగా, చిగురుపాటి వెంకట మూడు వికెట్లు సాధించాడు. అర్జున్ రాజ్‌పుత్ ఒక వికెట్ తీశాడు.337 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టుకు ఓపెనర్లు మంచి ఆరంభాన్ని అందించారు. లక్ష్య రాజేష్, ఆర్యవీర్ సెహ్వాగ్ ఆచితూచి ఆడుతూనే స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఆర్యవీర్ సెహ్వాగ్ 58 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అయితే అతడు ఔటైన తర్వాత భారత జట్టుపై ఒత్తిడి పెరిగింది. పాకిస్థాన్ బౌలర్లు వరుసగా వికెట్లు తీస్తూ మ్యాచ్‌పై పట్టు సాధించే ప్రయత్నం చేశారు. మరోవైపు లక్ష్య రాజేష్ మాత్రం బాధ్యతాయుతంగా ఆడుతూ జట్టును లక్ష్యం దిశగా నడిపించాడు. అతడు 80 పరుగులు చేసి కీలక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. అన్వయ్ ద్రావిడ్ 19 పరుగులు చేసి సహకారం అందించాడు.అయితే మధ్యలో వరుస వికెట్లు కోల్పోవడంతో భారత జట్టు విజయంపై అనుమానాలు నెలకొన్నాయి. భారీ లక్ష్యం కావడంతో ప్రతి పరుగూ కీలకంగా మారింది. పాకిస్థాన్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తూ భారత బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టారు. వికెట్లు పడుతున్నప్పటికీ భారత యువ ఆటగాళ్లు పోరాటం ఆపలేదు. చివరి దశలో మ్యాచ్ పూర్తిగా పాకిస్థాన్ వైపు మొగ్గుతున్నట్లు కనిపించింది. ఈ సమయంలో మనల్ చౌహాన్, మోహిత్ ఉల్వా క్రీజులో నిలిచి అసాధారణ పోరాటాన్ని ప్రదర్శించారు.మనల్ చౌహాన్ కేవలం 32 బంతుల్లో 47 పరుగులు చేసి భారత విజయానికి బలమైన పునాది వేశాడు. మరోవైపు మోహిత్ ఉల్వా 26 బంతుల్లోనే 49 పరుగులతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. వీరిద్దరూ పాకిస్థాన్ బౌలింగ్‌ను ధైర్యంగా ఎదుర్కొంటూ బౌండరీలు, సిక్సర్లతో పరుగుల వేగాన్ని పెంచారు. ముఖ్యంగా చివరి ఓవర్లలో ఒత్తిడిని అధిగమించి ఆడిన తీరు అద్భుతం. వీరిద్దరూ కలిసి కేవలం 35 బంతుల్లో 57 పరుగులు జోడించడంతో భారత విజయావకాశాలు మళ్లీ మెరుగుపడ్డాయి.చివరి క్షణాల్లో ఒక్కో పరుగు కోసం ఇరు జట్లు తీవ్రంగా పోరాడాయి. పాకిస్థాన్ ఆటగాళ్లు విజయంపై ఆశతో బౌలింగ్ చేయగా, భారత బ్యాటర్లు మాత్రం ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. చివరకు ఒక్క వికెట్ తేడాతో భారత్ లక్ష్యాన్ని అందుకుని చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. ఈ గెలుపుతో యువ భారత జట్టు ఆసియా కప్‌ను సగర్వంగా కైవసం చేసుకుంది.ఈ విజయం భారత యువ క్రికెటర్ల ప్రతిభకు, ఒత్తిడిలోనూ పోరాడే సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచింది. ముఖ్యంగా లక్ష్య ఛేదనలో విఫలమవుతుందనుకున్న దశ నుంచి జట్టును విజయతీరాలకు చేర్చిన మనల్ చౌహాన్, మోహిత్ ఉల్వా ప్రదర్శన ప్రత్యేకంగా నిలిచింది. అలాగే లక్ష్య రాజేష్, ఆర్యవీర్ సెహ్వాగ్ కీలక సమయంలో అందించిన పరుగులు కూడా విజయానికి దోహదపడ్డాయి.భారత్-పాకిస్థాన్ మ్యాచ్ అంటేనే అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తి ఉంటుంది. అలాంటి చిరకాల ప్రత్యర్థుల మధ్య జరిగిన ఫైనల్ చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగడం ఈ విజయానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. యువ ఆటగాళ్లు చూపిన పట్టుదల, సమష్టి కృషి భారత క్రికెట్ భవిష్యత్తుపై ఆశలు పెంచుతోంది. ఒక్క వికెట్ తేడాతో సాధించిన ఈ విజయం యువ భారత్‌కు చిరస్మరణీయ విజయంగా నిలిచిపోనుంది.

బుమ్రా బౌలింగ్‌ను ఎదుర్కోవడమే

అసలైన సవాల్!



ప్రపంచంలోని అత్యుత్తమ బౌలర్లలో బుమ్రా ఒకరు.. న్యూజిలాండ్ బ్యాటర్ విల్ యంగ్

మౌంట్ మాంగనూయి, నవంబర్ 14: భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్‌ను ఎదుర్కోవడం తమకు అతిపెద్ద సవాల్‌గా నిలుస్తుందని న్యూజిలాండ్ బ్యాటర్ విల్ యంగ్ అన్నారు. భారత్‌తో జరగనున్న రెండు టెస్టుల సిరీస్‌లో బుమ్రా తిరిగి జట్టులోకి రావడం తమకు కఠిన పరీక్షేనని పేర్కొన్నారు. అయితే తమ జట్టులోనూ అద్భుతమైన బౌలర్లు ఉన్నారని, భారత బ్యాటర్లకు కూడా గట్టి సవాల్ విసురుతామని ధీమా వ్యక్తం చేశారు.ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్న టెస్టు సిరీస్‌కు బుమ్రా అందుబాటులో ఉండటం భారత జట్టుకు పెద్ద బలమని యంగ్ అభిప్రాయపడ్డారు. ప్రపంచంలోని అత్యుత్తమ బౌలర్లలో బుమ్రా ఒకరని, అతడి బౌలింగ్‌లో ప్రత్యేకమైన సవాళ్లు ఎదురవుతాయని తెలిపారు. మోకాలి గాయం కారణంగా ఆగస్టులో శ్రీలంక పర్యటనకు దూరమైన బుమ్రా తిరిగి రావడం భారత బౌలింగ్‌ను మరింత పటిష్టం చేస్తుందన్నారు. 2024లో భారత్‌లో జరిగిన టెస్టు సిరీస్‌లో న్యూజిలాండ్ 3-0తో విజయం సాధించిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఆ సిరీస్ ఇప్పుడు గతమని, స్వదేశంలో జరిగే పోరు పూర్తిగా భిన్నంగా ఉంటుందని యంగ్ పేర్కొన్నారు. అప్పటి విజయం తమ జట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని చెప్పారు. శ్రీలంక చేతిలో 2-0తో ఓటమి తర్వాత భారత్‌పై ప్రత్యేక వ్యూహాలతో బరిలోకి దిగి విజయం సాధించామని గుర్తుచేశారు.న్యూజిలాండ్‌లోని వెల్లింగ్టన్, క్రైస్ట్‌చర్చ్ మైదానాల్లో జరిగే టెస్టుల్లో వాతావరణ పరిస్థితులు, గాలి ప్రభావం కీలకంగా మారతాయని తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా ఆటగాళ్లు తమ నైపుణ్యాలను ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. మరోవైపు భారత వన్డే బౌలింగ్ విభాగాన్ని కూడా యంగ్ ప్రశంసించారు. అర్ష్‌దీప్ సింగ్ రెండు వైపులా బంతిని స్వింగ్ చేయగలడని, ఆకిబ్ నబీ కూడా మంచి ప్రతిభ చూపిస్తున్నాడని అన్నారు. అన్షుల్ కాంబోజ్, బ్రార్‌ల బౌలింగ్‌లోనూ ప్రత్యేకత ఉందని పేర్కొన్నారు. భారత్ బౌలింగ్ విభాగం సమతూకంగా ఉందని కొనియాడారు.వచ్చే ఏడాది జరిగే ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించేందుకు ఇరు జట్లకూ ఈ సిరీస్ కీలకం కానుంది. దీంతో భారత్-న్యూజిలాండ్ మధ్య జరిగే రెండు టెస్టుల పోరు ఆసక్తికరంగా మారనుంది.



టెస్టు జట్టులో గుర్నూర్‌కు చోటు..

కుల్దీప్‌కు విశ్రాంతి!


హైదరాబాద్: న్యూజిలాండ్‌తో జరగనున్న రెండు టెస్టుల సిరీస్‌కు ముందు భారత జట్టులో కీలక మార్పు చోటుచేసుకుంది. యువ పేసర్ గుర్నూర్ బ్రార్‌కు సెలక్టర్లు అవకాశం కల్పించారు. మరోవైపు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను టెస్టు జట్టు నుంచి విడుదల చేశారు. ఈ విషయాన్ని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) శనివారం వెల్లడించింది.న్యూజిలాండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న గుర్నూర్ బ్రార్ ఇకపై టెస్టు జట్టుతో చేరనున్నాడు. దీంతో ఆదివారం జరగనున్న చివరి వన్డేకు అతడు అందుబాటులో ఉండడు. నవంబర్ 19 నుంచి వెల్లింగ్టన్‌లో ప్రారంభమయ్యే తొలి టెస్టు కోసం నేరుగా జట్టుతో కలవనున్నాడు.మరోవైపు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు దేశవాళీ క్రికెట్‌లో ఆడేందుకు బీసీసీఐ అనుమతించింది. ఉత్తరప్రదేశ్ జట్టు తరఫున ఆడేందుకు వీలుగా అతడిని టెస్టు జట్టు నుంచి విడుదల చేసింది. ఇప్పటికే వికెట్ కీపర్ రిషభ్ పంత్ టెస్టు జట్టుతో చేరాడు.భారత టెస్టు జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్, రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, అన్షుల్ కాంబోజ్, జస్‌ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, సాయి సుదర్శన్, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, మహమ్మద్ సిరాజ్, గుర్నూర్ బ్రార్.న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా భారత్ రెండు టెస్టు మ్యాచ్‌లు ఆడనుంది. తొలి టెస్టు నవంబర్ 19న వెల్లింగ్టన్‌లో ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లో గుర్నూర్ బ్రార్‌కు లభించిన అవకాశాన్ని అతడు ఎలా సద్వినియోగం చేసుకుంటాడన్నది ఆసక్తికరంగా మారింది.

పాక్‌తో ఫైనల్లో ఆర్యవీర్ మెరుపులు.. అర్ధ సెంచరీ



హైదరాబాద్: అండర్-19 ఆసియా కప్ ఫైనల్‌లో భారత యువ ఓపెనర్ ఆర్యవీర్ సెహ్వాగ్ అర్ధ సెంచరీతో ఆకట్టుకున్నాడు. పాకిస్థాన్‌తో జరుగుతున్న కీలక పోరులో భారత జట్టు లక్ష్య ఛేదనలో నిలకడగా రాణిస్తోంది. 17 ఓవర్లు ముగిసే సమయానికి భారత్ ఒక వికెట్ నష్టానికి 98 పరుగులు చేసింది.ఓపెనర్‌గా బరిలోకి దిగిన ఆర్యవీర్ 58 పరుగులు చేసి ఔటయ్యాడు. మరోవైపు లక్ష్య రాజేష్ 37 పరుగులతో క్రీజులో నిలిచి జట్టుకు అండగా నిలిచాడు. వీరిద్దరూ కలిసి 100 బంతుల్లో 88 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆర్యవీర్ వికెట్ కోల్పోయినప్పటికీ లక్ష్య ఛేదనలో భారత్ మంచి స్థితిలో కొనసాగుతోంది.అంతకుముందు టాస్ గెలిచిన పాకిస్థాన్ తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత 50 ఓవర్లలో 337 పరుగులు చేసింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత బ్యాటర్లు ఆచితూచి ఆడుతూ పరుగులు రాబడుతున్నారు. ఆర్యవీర్ అర్ధ సెంచరీతో భారత్‌కు శుభారంభం లభించింది. ఈ ఉత్కంఠ భరిత ఫైనల్లో భారత యువ జట్టు విజయం సాధించి ఆసియా కప్‌ను కైవసం చేసుకుంటుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

ఇసుక కాగితంతో గీతలు వేరుగా తెలుస్తాయి: వసీం అక్రమ్



క్రీడలు: 2018లో ఆస్ట్రేలియా క్రికెట్‌లో సంచలనం సృష్టించిన బాల్ ట్యాంపరింగ్ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ వ్యవహారంపై ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ చేసిన వ్యాఖ్యలపై పాకిస్థాన్ మాజీ దిగ్గజ బౌలర్ వసీం అక్రమ్ స్పందించాడు. బంతిని పరిశీలించే అనుభవం ఉన్న బౌలర్‌కు సహజంగా ఏర్పడే గీతలకు, ఇసుక కాగితంతో గీసిన గీతలకు మధ్య తేడా వెంటనే తెలుస్తుందని అభిప్రాయపడ్డాడు.

బంతిపై గీతలను గుర్తించడం కష్టం కాదు పాట్ కమిన్స్ తనకు ఇసుక కాగితంతో బంతిని దెబ్బతీసే విషయం తెలియదని చెప్పడంపై అక్రమ్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. బౌలర్‌గా బంతిని ఎప్పటికప్పుడు పరిశీలించడం, దాని ఒకవైపు మెరుపును కాపాడుకోవడం చాలా ముఖ్యమని తెలిపాడు. ఐదో ఓవర్‌లో అయినా, పదో ఓవర్‌లో అయినా, 50వ ఓవర్‌లో అయినా బంతిపై వచ్చే మార్పులను బౌలర్లు గమనిస్తారని పేర్కొన్నాడు. బంతి నేలకు తగలడం వల్ల ఏర్పడే గీతలకు, ఇసుక కాగితంతో రుద్దడం వల్ల ఏర్పడే గీతలకు స్పష్టమైన తేడా ఉంటుందని వివరించాడు.ఈ వివాదంలో తాను ఎవరి పక్షానా మాట్లాడటం లేదని అక్రమ్ స్పష్టం చేశాడు. కమిన్స్ తనకు మంచి స్నేహితుడని, గొప్ప క్రికెటర్ అని పేర్కొంటూనే, అనుభవజ్ఞుడైన బౌలర్‌గా బంతిని చూస్తే ఏదైనా అసాధారణంగా జరిగిందా లేదా గుర్తించగలనని చెప్పాడు. ఆస్ట్రేలియా క్రికెట్ నిజాయితీకి పేరొందిందని, ఈ వివాదం ఆ దేశ క్రికెట్ ప్రతిష్ఠపై ప్రభావం చూపుతోందని అభిప్రాయపడ్డాడు.**మళ్లీ తెరపైకి 2018 వివాదం**దక్షిణాఫ్రికాతో కేప్‌టౌన్‌లో జరిగిన టెస్టు మ్యాచ్ సందర్భంగా 2018లో బంతిని ఇసుక కాగితంతో రుద్దుతూ కెమెరాలకు చిక్కిన కామెరూన్ బాన్‌క్రాఫ్ట్ ఘటన అప్పట్లో ప్రపంచ క్రికెట్‌ను కుదిపేసింది. ఈ వ్యవహారంలో అప్పటి కెప్టెన్ స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్, బాన్‌క్రాఫ్ట్‌లపై క్రికెట్ ఆస్ట్రేలియా చర్యలు తీసుకుంది.తాజాగా ఉస్మాన్ ఖవాజా తన ఆత్మకథలో ఈ ఘటనపై చేసిన వ్యాఖ్యలతో వివాదం మళ్లీ మొదలైంది. జట్టులోని పలువురికి ఈ వ్యవహారం గురించి ముందే తెలుసని ఖవాజా పేర్కొన్నట్లు వార్తలు వచ్చాయి. అయితే పాట్ కమిన్స్ ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించాడు. తనకు ఇసుక కాగితంతో బంతిని దెబ్బతీసే విషయం తెలియదని, అలాంటి కుట్రలో తాను భాగస్వామిని కాదని స్పష్టం చేశాడు. ఈ నేపథ్యంలో వసీం అక్రమ్ వ్యాఖ్యలు క్రికెట్ వర్గాల్లో మరోసారి చర్చకు దారితీశాయి.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

డబుల్ సక్సెస్‌తో దిల్ రాజు..

పవన్‌తో మరో సినిమాపై కీలక ప్రకటన?



ప్రముఖ నిర్మాత దిల్ రాజు ప్రస్తుతం రెట్టింపు ఉత్సాహంతో ఉన్నట్లు తెలిపారు. తాను పంపిణీ చేసిన రెండు సినిమాలు ఘనవిజయం సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తన నిర్మాణ సంస్థ నుంచి రాబోయే చిత్రాల వివరాలను వెల్లడించాడు.తెలుగు రాష్ట్రాల్లో తాము పంపిణీ చేసిన రణబీర్ కపూర్ 'రామాయణం' చిత్రం ఇప్పటికే రూ. 1000 కోట్ల వసూళ్ల మార్కును అధిగమించిందని, లాంగ్ రన్‌లో రూ. 2000 కోట్ల నెట్ సాధించే అవకాశం ఉందని దిల్ రాజు అంచనా వేశారు. అలాగే నైజాం ఏరియాలో విడుదల చేసిన సూర్య నటించిన 'సీన్' చిత్రం కూడా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుందని, తక్కువ బడ్జెట్‌లోనూ బలమైన కథాంశంతో విజయం సాధించవచ్చని ఈ సినిమా నిరూపించిందని పేర్కొన్నాడు. ఈ రెండు విజయాలు తనకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చాయని ఆయన తెలిపాడు.

ఈ సందర్భంగా తన కొత్త ప్రాజెక్టుల వివరాలను ఆయన వెల్లడించాడు. రవితేజతో రూపొందించనున్న చిత్రానికి 'వీరాధి వీరులంట' అనే టైటిల్ ఖరారు చేశామని, ఫిబ్రవరి నుంచి చిత్రీకరణ ప్రారంభం కానుందని పేర్కొన్నాడు. సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ హీరోగా పరిచయమవుతున్న 'ఎల్లమ్మ'తో పాటు విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న 'రౌడీ జనార్దన' చిత్రాలను వచ్చే వేసవిలో విడుదల చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలిపాడు.ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో మరో సినిమా చేసే అంశంపై చర్చలు జరిగినట్లు తెలిపాడు. కథ, దర్శకుడు ఖరారయ్యాక పూర్తి వివరాలతో అధికారిక ప్రకటన ఉంటుందని స్పష్టం చేశాడు. అలాగే, దర్శకుడు అనిల్ రావిపూడితో 2028 సంక్రాంతి కానుకగా ఒక సినిమాను విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించాడు. వీటితో పాటు హిందీలో అక్షయ్ కుమార్, సల్మాన్ ఖాన్‌లతో తాను నిర్మిస్తున్న చిత్రాల విడుదల తేదీలను కూడా ఈ సందర్భంగా ఆయన ప్రకటించాడు.

'దాదా' ధమాకా మొదలైంది..

దుమ్మురేపుతున్న బాలయ్య, నర్గీస్ ఫక్రి పబ్ సాంగ్



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా, దర్శకుడు గోపీచంద్ మలినేని రూపొందిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'దాదా'. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ తొలి పాటను విడుదల చేశారు. 'దాదా ధమాకా' పేరుతో వచ్చిన ఈ పల్సేటింగ్ సాంగ్ అభిమానులను ఉర్రూతలూగిస్తోంది. ఈ పాట బాలయ్య అభిమానులకు ఫుల్ మీల్స్ లాంటి ట్రీట్ అందిస్తోంది. వైబ్రెంట్ పబ్ బ్యాక్‌డ్రాప్‌లో బాలకృష్ణ, బాలీవుడ్ అందాల భామ నర్గీస్ ఫక్రిపై ఈ పాటను చిత్రీకరించారు. బాలయ్య, గోపీచంద్ మలినేని ఇద్దరితోనూ సూపర్ హిట్ ఆల్బమ్స్ ఇచ్చిన సంగీత దర్శకుడు ఎస్. తమన్, ఈ సినిమాకు కూడా తనదైన శైలిలో అదిరిపోయే ఎనర్జిటిక్ డ్యాన్స్ నంబర్‌ను అందించాడు. రామజోగయ్య శాస్త్రి రాసిన సాహిత్యం పాటకు మరింత ఉత్సాహాన్నిచ్చింది. ఈ పాటలో విశేషమేమిటంటే, గాయని రజని శ్రీ పూర్ణిమతో పాటు బాలకృష్ణ స్వయంగా కొంత భాగం ఆలపించి అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చారు.

విజువల్స్ పరంగా కూడా ఈ పాట ఆకట్టుకుంటోంది. శేఖర్ వీజే మాస్టర్ తన కొరియోగ్రఫీతో బాలయ్య మార్క్ స్టెప్పులను స్టైలిష్‌గా డిజైన్ చేశారు. సన్ గ్లాసెస్, సిగార్‌తో బాలయ్య పార్టీ అవతార్‌లో కనిపించగా, నర్గీస్ ఫక్రి తన గ్లామర్‌తో స్క్రీన్స్‌పై మెరిశారు. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ, ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్స్ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రమిది. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇందులో మనోజ్ మంచు, కాజల్ అగర్వాల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఇటీవల గాయం కారణంగా శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకున్న బాలకృష్ణ, మళ్లీ షూటింగ్‌లో చేరినట్లు చిత్ర యూనిట్ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం సినిమా చిత్రీకరణ చివరి దశకు చేరుకుంది. అరవింద్ ఎస్ కశ్యప్ సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్, సాయి మాధవ్ బుర్రా సంభాషణలు అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు

పెళ్లి పీటలు ఎక్కబోతున్న 'గద్దలకొండ గణేష్' ఫేమ్ మిర్నాళిని రవి



'గద్దలకొండ గణేష్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన యువ నటి మిర్నాళిని రవి త్వరలోనే పెళ్లి పీటలెక్కనున్నారు. తన చిరకాల మిత్రుడు, పరంపొరుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మహావిష్ణుతో ఆమె కొత్త జీవితాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో పెళ్లికి ముందు తన స్నేహితులతో కలిసి ఆమె బ్యాచ్‌లర్ పార్టీని గ్రాండ్‌గా ఎంజాయ్ చేశారు.

ఈ వేడుకకు సంబంధించిన ప్రత్యేక వీడియోను మిర్నాళిని స్వయంగా తన సోషల్ మీడియా ఖాతా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో అభిమానులు, నెటిజన్లు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మిర్నాళిని రవి, మహావిష్ణు మధ్య గత 7 ఏళ్లుగా మంచి స్నేహం ఉంది. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారడంతో, పెద్దల అంగీకారంతో ఈ ఏడాది ఆగస్టులో వీరి నిశ్చితార్థం అధికారికంగా జరిగింది. మహావిష్ణు ఆధ్యాత్మిక గురువుగా, ప్రముఖ వక్తగా గుర్తింపు పొందారు. వీరి వివాహ వేదిక, కచ్చితమైన తేదీపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. పెళ్లి తర్వాత ఆమె నటనకు దూరమవుతారనే ప్రచారం జరుగుతున్నప్పటికీ, దీనిపై మిర్నాళిని నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.



చిరుకు కథ చెప్పిన త్రివిక్రమ్..

డీవీవీ బ్యానర్‌లో భారీ ప్రాజెక్ట్!



మెగాస్టార్ చిరంజీవి, స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఓ సినిమా రాబోతోందనే వార్తలు టాలీవుడ్‌లో జోరుగా చక్కర్లు కొడుతున్నాయి. వీరిద్దరి కలయికలో సినిమా కోసం మెగా అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఆసక్తికరమైన చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని సమాచారం.

ఫిల్మ్ నగర్ వర్గాల ప్రకారం.. ఇటీవల త్రివిక్రమ్ శ్రీనివాస్ మెగాస్టార్ చిరంజీవిని కలిసి ఓ ఆసక్తికరమైన కథాంశాన్ని వినిపించారు. ఈ స్టోరీ లైన్ చిరంజీవిని బాగా ఆకట్టుకుందని, పూర్తి స్క్రిప్ట్‌ను సిద్ధం చేయమని ఆయన త్రివిక్రమ్‌కు సూచించినట్లు చెబుతున్నారు. నిర్మాత డీవీవీ దానయ్య ఈ కాంబినేషన్‌ను సెట్ చేసేందుకు చురుగ్గా ప్రయత్నిస్తున్నారని, గతంలో త్రివిక్రమ్‌తో ఉన్న కమిట్‌మెంట్ మేరకు ఈ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించాలని చూస్తున్నారని ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది.గతంలో చిరంజీవి నటించిన 'జై చిరంజీవ' చిత్రానికి త్రివిక్రమ్ కథ, మాటలు అందించారు. కానీ, ఆయన దర్శకత్వంలో మెగాస్టార్ నటించలేదు. అయితే, పవన్ కల్యాణ్, అల్లు అర్జున్ వంటి ఇతర మెగా హీరోలతో త్రివిక్రమ్ బ్లాక్‌బస్టర్ హిట్స్ ఇచ్చారు. దీంతో చిరంజీవిని త్రివిక్రమ్ డైరెక్ట్ చేస్తే చూడాలని అభిమానులు దశాబ్దాలుగా ఆశిస్తున్నారు.ప్రస్తుతం త్రివిక్రమ్ తన తదుపరి ప్రాజెక్ట్‌పై దృష్టి సారించారు. జూనియర్ ఎన్టీఆర్‌తో 'గాడ్ ఆఫ్ వార్' అనే వర్కింగ్ టైటిల్‌తో ఓ భారీ మైథలాజికల్ సినిమాను తెరకెక్కించే పనుల్లో ఆయన బిజీగా ఉన్నారు. ఇటీవల ఎన్టీఆర్, కల్యాణ్ రామ్, నిర్మాత రాధాకృష్ణతో కలిసి త్రివిక్రమ్ దిగిన ఫొటో బయటకు రావడంతో ఆ ప్రాజెక్ట్ పక్కాగా పట్టాలెక్కుతోందని స్పష్టమైంది. మరోవైపు చిరంజీవి 'కాకా' అనే తన తదుపరి చిత్రం షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ సినిమాను సంక్రాంతికి విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్‌తో త్రివిక్రమ్ సినిమా పూర్తయిన తర్వాతే చిరంజీవితో ప్రాజెక్ట్ పట్టాలెక్కే అవకాశాలున్నాయని ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. మరి ఈ వార్తల్లో ఎంతవరకు నిజముందో తెలియాల్సి ఉంది.

'ఎఐఆ వింటారా సరదాగా' విడుదల తేదీ ఖరారు

యంగ్ హీరో అశోక్ గల్లా, శ్రీ గౌరీ ప్రియ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎఐఆ వింటారా సరదాగా' విడుదల తేదీ ఖరారైంది. నూతన సంవత్సర కానుకగా 2027 జనవరి 1న ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌ను ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ప్రేమ, స్నేహం, వినోదం మేళవింపుగా రూపొందుతున్న ఈ చిత్రం యువతను విశేషంగా ఆకట్టుకుంటుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.ఉద్భవ్ రఘు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా పూర్తిగా అమెరికా నేపథ్యంలో సాగుతుంది. ఉన్నత ఆశయాలతో విదేశాలకు వెళ్లిన తెలుగు విద్యార్థుల జీవితాలు, వారి జీవనశైలి, ఎదురయ్యే సవాళ్లు, స్నేహాలు, ప్రేమ ప్రయాణాల చుట్టూ ఈ కథనం నడుస్తుంది. విద్యార్థి దశలోని సరదా క్షణాలతో పాటు అనుకోని పరిస్థితులను హాస్యభరితంగా, ఆసక్తికరంగా దర్శకుడు తెరపై ఆవిష్కరించినట్లు తెలుస్తోంది.ఈ చిత్రంలో రాహుల్ విజయ్, శివాత్మిక రాజశేఖర్, సత్య, వైవా హర్ష, గుండు సుదర్శన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ ఎస్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకంపై సాయి సౌజన్య సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.చిత్రానికి విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'అనగా అనగా అమెరికా', 'చింగారి' పాటలు శ్రోతల నుంచి మంచి ఆదరణ పొందాయి. సంజిత్ హెర్డే పాడిన పాట అమెరికా ప్రయాణంలోని ఉత్సాహాన్ని ప్రతిబింబించగా, సిద్ శ్రీరామ్, లిప్సిక ఆలపించిన పాట ప్రేమలోని అనుభూతులను చక్కగా పలికించింది. ఇప్పటికే విడుదలైన రెండు టీజర్లు, హీరోహీరోయిన్ల మధ్య కెమిస్ట్రీ సినిమాపై సానుకూల బజ్‌ను ఏర్పరిచాయి. 2027 నూతన సంవత్సరాన్ని పూర్తి స్థాయి వినోదంతో ప్రారంభించేందుకు ఈ చిత్రం సిద్ధమవుతోంది.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613